(పెద్దకథ)

# పౌరుష్యము

సుమారు రెండువేల మూడు వందల సంవత్సరాల క్రితం జరిగిన కథ ఇది.

అనగా అలెగ్జాండరు మన దేశంమీదకు దండెత్తి వచ్చిన రోజులలోనన్నమాట.

అలెగ్జాండరంటే మన దేశానికి పడమటగానున్న గ్రీసు దేశంలోని మాసిడోనియా అనే ప్రాంతానికి రాజు. ఆ రాజ్యం చిన్నదే కాని అతని ఆశ మాత్రం చాలా గొప్పది. అలెగ్జాండరుకు ప్రపంచాన్నంతా జయించాలన్న కోర్కె పుట్టి, అతడు దండయాత్ర సాగించాడు. ఒక్కొక్క దేశాన్నే జయించుకుంటూ వచ్చి, మన దేశం ప్రవేశించాడు.

మన దేశం వాయవ్య దిశలో హిందూకుష్ పర్వతాలున్నాయి. ఆ పర్వతాలలో కనుమలు చాలా ఉన్నాయి. ఆ కనుమలద్వారా గ్రీకు సైన్యం వచ్చి పంజాబు చేరుకుంది.

పంజాబ్ అంటే ఐదు నదులుగల దేశం. వాటిలో జీలం, చీనాబ్ అనేవి రెండు. ఆ రెండింటి మధ్యాగల ప్రాంతాన్ని ఆ కాలంలో పురుషోత్తముడనే రాజు పరిపాలిస్తుండేవాడు.

ఆ పరిసరాలలో ఇంకా చిన్న చిన్న రాజ్యాలు చాలా ఉండేవి. తక్షశిల రాజ్యం వాటిలో ముఖ్యమైనది. ఆ రాజ్యాన్ని 'అంభి' అనే రాజు పాలించేవాడు. అంభి గొప్పరాజే గాని అపారంగా వస్తోన్న గ్రీకు సేనల్ని చూసేసరికి ఆతడు హడిలిపోయి, యుద్ధం చెయ్యకుండానే లొంగిపోయి, అలెగ్జాండరుకు కప్పం కట్టడానికి ఒప్పుగున్నాడు.

పురుషోత్తముడు మాత్రం అలాగ బెదిరిపోలేదు. అతడు తన సేనలతో అలెగ్జాండరు సైన్యాన్ని ఎదుర్కొన్నాడు.

కాని యుద్ధంలో పురుషోత్తమునకు ఓటమి తప్పిందికాదు. అతణ్ణి ఖైదీగా చేసి తీసుకుపోయి, గ్రీకుసైనికులు అలెగ్జాండరు చక్రవర్తిముందు నిలబెట్టేరు.

'పురుషోత్తముడ'నే మాట సరిగా పలుకలేక అలెగ్జాండరాతణ్ణి 'పోరస్' అని పిలిచాడు. అలెగ్జాండరు మహాయోధుడు గనుక తన సేనలతో మహాపరాక్రమంతో పోరిన పోరస్ అంటే అతనికి కోపానికి బదులు గౌరవభావం ఏర్పడింది. 'పోరస్, నిన్ను ఎలా గౌరవించమంటావు?' అని అడిగాడు.

'రాజవలె గౌరవించు!' అన్నాడు పురుషోత్తముడు. ఖైదీగా వచ్చికూడా నదురూ బెదురూ లేకుండా ఠీవిగా మాట్లాడిన పోరసును చూస్తే అలెగ్జాండరుకు గౌరవం మరీ ఎక్కువై, ఎంతో ఔదార్యం కనపరుస్తో 'పోరస్, నిన్ను రాజవలె గౌరవించాలంటే నీరాజ్యం నీకిచ్చెయ్యాలన్నమాట! ఇచ్చేశాను, పుచ్చుకో!' అని అతని బంధాలు విడిపించి, సత్కరించి పంపేశాడు.

అలెగ్జాండరు ఔదార్యాని కందరూ మెచ్చుకున్నారు. కాని ఆయన మంచితనం, నేర్పూ ఆయన సేనాధిపతులలో ఎవరికీ లేదు. అలెగ్జాండరు సేనాధిపతులలో ముఖ్యుడు 'సెల్యూకసు'. తాను జయించిన పంజాబుకు సెల్యూకసును పాలకునిగా చేసి, అలెగ్జాండరు సేనలతో ముందుకు సాగిపోయాడు. పోతూ సెల్యూకసుతో, 'ప్రజల్ని అనవసరంగా పీడించకు సుమా. దయా, సానుభూతీ కనపరుస్తో ప్రజల హృద

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

యాలను వశం చేసుకోవాలి కాని క్రౌర్యం చూపరాదు.' అని బోధించాడు.

కాని ఆ బోధ సెల్యూకసు పట్ల, బూడిదలో పోసిన పన్నీరులాగ వృథాఐంది. సెల్యూకసుకి భారతీయులు అంటే ప్రేమ, గౌరవం లేదు సరిగదా వాళ్లంటే 'పశువులకన్నా తక్కువ' అనే భావం ఏర్పడింది. నాయకుణ్ణి అనుసరించే తక్కిన గ్రీకులుకూడా భారతీయులనుగురించి మాట్లాడవలసివచ్చినప్పుడల్లా 'మృగాలు' అంటూండేవారు.

పురుషోత్తమునకు అలెగ్జాండరు స్వయంగా



రాజ్యం ఇప్పించేశాడు గనుక దక్కింది. అతనితో పాటు యుద్ధంలో ఓడిపోయి రాజ్యాలుపోగొట్టుకున్న తక్కిన చిన్నరాజుల రాజ్యాలేవీ, వారికి తిరిగీ వశం కాలేదు. వాళ్లంతా, 'మీకు మేము కప్పాలు కడతాం. మా రాజ్యాలు మమ్మల్ని ఏలుకోనివ్వండి.' అని అలెగ్జాండరు చక్రవర్తికి మహజర్లు పంపుకున్నారుకాని, సెల్యూకసు వాటిని చక్రవర్తికి చేరనివ్వక, బుట్టదాఖలు చేసి, ఆ రాజ్యాలన్నీ ఊడపెరుక్కున్నాడు. అలాగ రాజ్యాన్ని పోగొట్టుకున్న చిన్నరాజులలో పుష్కలావతిరాజు, విశ్వజిత్తు ఒకడు.

విశ్వజిత్తు సెల్యూకసువల్ల తనకు జరిగిన అన్యాయాన్ని సహించలేక తనతోపాటు భంగపడిన తక్కిన రాజులను కొందరిని కూడగట్టుకుని, తిరుగుబాటు లేవదీశాడు. కాని లాభంలేకపోయింది. యుద్ధంలో ఘోరమైన గాయాలు తగిలి, అతడు చాలా అపాయస్థితిలో ఉండగా అతనిగుఱ్ఱం అతణ్ణి రణరంగంలోంచి తీసుకొచ్చేసి రక్షించింది. సెల్యూకసు విశ్వజిత్తుపై రాజద్రోహ నేరం మోపి, 'ఎక్కడున్నాడో వెతికి పట్టుకుని ఉరితియ్యండి.' అని తన సైనికులకు ఆజ్ఞాపించాడు. దానితో విశ్వజిత్తు తన గాయాలు ఆరకుండానే, కట్టుబట్టలతోటీ, భార్యాపుత్రులతోటీ సమీపంలో ఉన్న అరణ్యంలోకి పారిపోయి, అక్కడొక గుహలో తల దాచుకోవలసివచ్చింది.

పుష్కలావతిలో విశ్వజిత్తు నివసించే కోట చాలా చక్కనిది. విశ్వజిత్తు అడవులపాలైన పిమ్మట, ఆ కోటను సెల్యూకసు తన మిత్రుడైన రోహిలసుకు ఇనాముగా ఇచ్చి అక్కడ నివాసం ఏర్పరుచుకోమన్నాడు.

రోహిలసు అలెగ్జాండరుకు అనేక యుద్ధాలలో సాయపడి పరాక్రమవంతుడనే పేరు తెచ్చుకున్న యోధుడు. అతడంటే చక్రవర్తికి చాలా అభిమానం. అతడు పంజాబులో స్థిరనివాసమేర్పరుచుకోడానికి నిశ్చయించుకున్నట్లు తెలియటంతోనే చక్రవర్తి, 'నీ కిష్టమైనచోట చక్కని కోట కట్టుకో. దానికయ్యే ఖర్చు నేను భరిస్తాను' అని కబురు చేయించాడు. కాని రోహిలసుకు కోట కట్టుకోవలసిన అవసరమే లేకపోయింది. 'కట్టేవాడొకడూ, అనుభవించేవాడు మరొకడూ' అన్నట్లుగా, విశ్వజిత్తు నిర్మించుకున్న పుష్కలావతి కోట రోహిలసు పరమైంది.

రోహిలసుకు భార్య పోయింది. అతని కొక్క కూతురు తప్ప పిల్లలు లేరు. ఆ బాలిక పేరు హెర్మియా.

ఈ హెర్మియాయే మన కథానాయిక. ఈ పదేళ్ల గ్రీకు బాలిక, ఇరవైమూడు వందల సంవత్సరాలక్రితం, వసంతకాలంలో ఒకనాటి ఉదయం, తన పరివారంతో పుష్కలావతికోటను ప్రవేశించటంతో మన కథ ప్రారంభమైంది.

## 2

హెర్మియా ఒక తెల్లని చిట్టిగుఱ్ఱంపైన ఎక్కి వచ్చింది. ఆమె ప్రక్కనే, ఎత్తైన ఎర్రని అరబ్బీగుఱ్ఱం మీద ఆమె అంగరక్షకుడైన ఎగెయూసు వచ్చాడు. ఆతడు యాభై యేళ్ల వయసువాడు. ఒడ్డూ, పొడవూగల యోధుడు. వారి వెనకాల మరొక గుఱ్ఱంమీద, ముప్ఫై ఐదేళ్ల స్త్రీ ఒకామె వచ్చింది. ఆమెపేరు హిపోలిటా. ఆమె హెర్మియాను పెంచిన దాది. దాదివెనుక గుఱ్ఱాలపైన ఆరుగురు వీరులు కత్తులూ, బల్లేలూ ధరించి వచ్చారు.

'ఎగెయూస్, నాకు ఆయాసంగా ఉంది. ఇంకా ఎంతదూరం వెళ్లాలి?' అంది హెర్మియా.

'ఆ కనపడేదే కోట. వచ్చేశాం' అన్నాడు ఎగెయూసు.

హెర్మియా రికాబులతో గుర్రం పక్కలను నొక్కి పరుగెత్తించింది దానితో తక్కిన గుఱ్ఱాలుకూడా వేగాన్ని హెచ్చించాయి. వాళ్ళంతా మరొక కొంతసేపటిలో పుష్కలావతికోట ప్రవేశించారు.

'ఎంత అందంగా ఉన్నాయో ఈ పూల మొక్కలు! ఈ ఉద్యానవనాన్ని మా నాయనేనా వేయిస్తే? ఈ రాతిగోడలు ఈగవాలితే జారిపోయేటట్లు ఎంత నున్నగా ఉన్నాయో!' అంది హెర్మియా.

'ఇక్కడ మీ నాయన కట్టించబోయే భవనం ఇంకా ఎంతో అందంగా ఉంటుందమ్మా. అలెగ్జాండరు చక్రవర్తి వస్తే ఉండటానికి తగ్గ మేడ ఒకటి కట్టిస్తున్నారు. పునాదులప్పుడే తయారవుతున్నాయి చూడండి.' అన్నాడు ఎగెయూసు.

'ఆ తవ్వేపనివాళ్లు అంత నిరుత్సాహంగా ఉన్నారెందువల్ల?' అంది హెర్మియా.

'యుద్ధంలో ఓడి బానిసలుగా లాక్కురాబడ్డ 'ఇండియన్లు' వాళ్ళు. పనిచెయ్యటమంటే కిట్టదు గాడిదలకి!' అన్నాడు ఎగెయూసు.

'మనుషుల్ని పట్టుకుని గాడిదలంటా డేమిటి?' అనిపించింది హెర్మియాకి. ఆమె ఏదో అనబోయింది గాని ఇంతలో ఎగెయూసు, 'ఇదేనమ్మా మీరు ఉండబోయే భవనం. దిగండి!' అన్నాడు.

ఆమె గుర్రాన్ని ఆపింది. ఎగెయూసు తన గుఱ్ఱంమీదనుండి దిగివచ్చి, ఆమెను దింపేడు. ఆమె ఆ సుందరహార్మ్యాన్ని ప్రవేశించి, ఆ నేల నునుపూ, ఆ గోడలమీది బొమ్మల అందమూ చూసి మురిసిపోయింది. 'ఇంతకు ముందు ఈ కోటలో ఎవ రుండేవారో?' అని అడిగింది.

'ఎవడో పంది!' అన్నాడు ఎగెయూసు.

'దేవతలుండతగ్గ దివ్యభవనమిది. పందు లున్నాయంటా వేమిటి ఎగెయూస్?' అంది హెర్మియా.

ఎగెయూసు ఆమె అమాయకత్వానికి నవ్వుతూ 'పంది అంటే పంది కాదమ్మా. పందివంటి ఇండియన్ అన్నమాట! వాడి పేరు నాకు సరిగా రాదు. ఇటలీ దేశంలోని అగ్నిపర్వతంపేరు తెలుసా మీకు?' అన్నాడు.

'వెసూవియసు' అంది హెర్మియా.

"వీడి పేరుకూడా అలాంటిదే 'విసుజిసు' అని కాబోలు అంటారు" అన్నాడు ఎగెయూసు. ఆ గ్రీకు సైనికుని నాలుకమీద 'విశ్వజిత్తు' 'విసుజిసు'గా మారవలసివచ్చింది!

'ఈ విసుజిసు ఇప్పు డెక్కడున్నాడు మరి?' అని అడిగింది హెర్మియా.

'ఏమో ఎవరికి తెలుసు? ఏ పొదలోనో గుహలోనో తలదాచుకుని ఉండాలి. బయటకొచ్చి ఏ గ్రీకు సైనికుని కంటబడ్డా వాడిపని ఐపోయిందన్నమాటే! పొడిచి చంపనైనా చంపుతారు, లేకపోతే లాక్కుపోయి బానిసను చేస్తారు!' అన్నాడు ఎగెయూసు.

"అలా చెయ్యటానికి, 'విసుజిసు' చేసిన నేరమేమిటో?" అంది హెర్మియా.

"ఇంతకన్నా ఏంకావాలి? యుద్ధంలో ఓడిపోయినగాడిద, కోటను విడిచి పొమ్మంటే పోక ఎదురు తిరిగితే మహాసేనాని సెల్యూకసు, 'ఎక్కడ దొరికితే అక్కడ, ఎలకను చంపినట్లు బాది చంపండి!' అని ఆజ్ఞాపించాడు." అన్నాడు ఎగెయూసు.

'అంత చంపవలసిన అవసరం నాకేమీ కనపడటంలేదు. పైవాడెవడో వచ్చి మాయింట్లోంచి మమ్మల్ని పొమ్మంటే నా కెంతేనా కోపంవస్తుంది. ఎవడికైనా వస్తుంది కోపం. నీకు రాదూ?' అంది హెర్మియా.

ఎగెయూసు సమాధానం చెప్పలేకపోయాడు. మాట మార్చేసి, ఆమెను ఒక్కొక్క గదిలోకే తీసుకువెళ్ళి చూపుతో, 'ఇది మీ భోజనాలగది; ఇది కుట్టు నేర్చుకునే గది. ఇది పడకగది' అంటూ చూపెట్టేడు.

ఆమె భోజనమయాక పరుండి ఆగది కిటికీలోంచి చూసేసరికి దూరంగా ఉన్న చిట్టడవి కనపడింది. ఆ అడవిలో ప్రవహించే సెలయేటిని చూస్తూ, అక్కడ ఏ చెట్టు కొమ్మపైనుండో వినవస్తూన్న వసంతకోకిల గానము వింటూ ప్రయాణపు బడలికలో ఉండడంచేత కన్నులు ఇట్టే మూతపడి ఆమె నిద్రపోయింది.

## 3

హెర్మియాతో పుష్కలావతికోటను చేరుకున్న పరివారం, ఆమె అంగరక్షకుడైన ఎగెయూసూ, దాది హిపోలిటా, మరి ఆరుగురు గ్రీకు సైనికులూ అని చెప్పాము. ఆమెతో తండ్రి రోహిలసు రాలేదు. అతడు అలెగ్జాండరుచే జయింపబడిన పారశీక దేశంలో ఏదో తిరుగుబాటు వస్తే దాన్ని అణిచివేయడానికి అక్కడ కొన్నాళ్ళు ఉండిపోవలసివచ్చింది. అందువల్ల కుమార్తెకు దాదినీ, ఎగెయూసునూ, సైనికులనూ సాయమిచ్చి ముందుగా పుష్కలావతికి పంపడం జరిగింది.

ఆ కాలంలో ఇప్పటికిమల్లే ఎక్కడపడితే అక్కడ చదువుకోడానికి బడులు లేవు. గొప్పయింటి బిడ్డలకి తలితండ్రులు ఏ పండితుణ్ణో పెట్టి చదువు చెప్పించేవారు. హెర్మియాకు ప్రస్తుతం అటువంటి యేర్పాటింకా జరుగలేదు. రోహిలసు వచ్చాకనే ఆమెకు చదువు చెప్పే గురువు వస్తాడు. ఈలోగా ఆమె దాది హిపోలిటా చెప్పే కుట్టుపని నేర్చుకుంటూ కాలక్షేపం చేసేది. ఆమె పట్టుగుడ్డలమీద సన్నటి రంగుదారాలతో పువ్వులు కుట్టేది. ఆ పువ్వులమీదికి వచ్చి వాలుతోన్నట్లుగా సీతాకోకచిలుకలను కుట్టేది.

గ్రీకు దేశంలో 'హార్పు' అనే ఒక రకం వీణ ఉంటుంది. ఆ వీణ హెర్మియాకుకూడా ఉందిగాని దాన్ని వాయించడం అంత బాగా ఆమెకు తెలి

## ★ హిరణ్మయి ★

యదు. ఐనా ఆమె మధ్య మధ్య దాన్ని తీసి, కాస్త 'టుం, టుం' అనిపిస్తోండేది.

హెర్మియాకు పువ్వులంటే మహాయిష్టం. పుష్కలావతిలో పుష్పాలు పుష్కలంగా పూచేవి. ఒక్కొక్క రకమే కోసి తెచ్చి దండగా గ్రుచ్చి, తలకు కిరీటంలాగ చుట్టుకునేది. గ్రీకుపిల్లలకు పూలమాలలను కిరీటాలకు మల్లే చుట్టుకోడమంటే సరదా.

బానిసలుగా పనిచేస్తోన్న భారతీయులకు ఆ పిల్ల అంటే మొదట కోపంగానే ఉండి ఆమె వచ్చినప్పుడల్లా మొహం చిట్లించుకునేవారు. కాని క్రమేపీ హెర్మియా అంటే వాళ్లకి అసహ్యం పోయి, ప్రేమ భావం ఏర్పడింది. ఏమంటే ఆమె ఎప్పుడూ వాళ్ళని పలకరించకుండా వెళ్లేదికాదు. గ్రీకుభాష వాళ్ళకి సరిగా అర్థంగాకపోయినా ఆమె మంచిగా పలకరిస్తోం దనిమాత్రం వాళ్ళకి తెలుసు. ఆమె వాళ్ళకేసి చూసి మందహాసం చేసినప్పుడల్లా, ఆ బాలిక అందాలముఖం వాళ్ళకి వికసించిన రోజాపుష్పంలా కనపడి, వాళ్లు కూడా తమ దురవస్థను మరిచిపోయి, చిరునవ్వుతో సమాధాన మిచ్చేవారు. అప్పటి భారతీయులు మాట్లాడుకునేభాష ఒక రకమైన సంస్కృతం. హెర్మియాకు మొదట ఆభాష యేమీ అర్థమయేదుకాదుగాని వాళ్లు తన్ను అసహ్యించుకోవటం లేదనిమాత్రం ఆమె గ్రహించగలిగింది.

పుష్కలావతిలో రోహిలసే గనుక ఉన్నట్లైతే హెర్మియాను ఆ పనివాళ్లవద్దకు పోనిచ్చిఉండడు. ఎగెయూసు కూడా 'వాళ్లు బానిసలు! వాళ్లతో మాట్లాడకూడదు. వాళ్లు మనకు శత్రువులు గనుక నీకేమైనా హాని చెయ్యవచ్చుకూడను' అంటూండేవాడు కాని హెర్మియా అతడంటే లక్ష్యపెట్టక మధ్యమధ్య తోచినప్పుడల్లా పునాదులు త్రవ్వే ఆ బానిసలవద్దకు పోయి కబుర్లుచెపుతూండేది.

పిల్లలకి ఏ భాషైనా ఇట్టే వచ్చేస్తుంది. హెర్మియాకుకూడా భారతీయులు మాట్లాడే సంస్కృత భాష రావటానికి ఎంతోకాలం పట్టలేదు. ఖర్మం కాలి బానిసలయారు కాని ఆ పనివాళ్ళంతా కాస్తో కూస్తో చదువుకుని స్వాతంత్ర్యంకోసం గ్రీకులతో పోరాడిన యోధులే. వాళ్లలో ఒకడికి ఋగ్వేదంలోని ఇంద్రుడూ, అగ్ని, వరుణుడూ మొదలైన దేవతల కథలన్నీ తెలుసు. ఆ కథలన్నీ వాడు హెర్మియాకు చెపుతూండేవాడు.

'మాకూ ఉన్నారు ఇలాంటి దేవుళ్ళు' అంటూ ఆమె జూపిటరు, మినర్వా మొదలైన గ్రీకుదేవతలను గురించి వాళ్ళకు చెపుతూండేది. 'దేవతలలో మంచివాళ్ళూ చెడ్డవాళ్ళూ ఉన్నారు. మంచి దేవతలు వర్షాలు కురిపించి ఉపకారంచేస్తే చెడ్డదేవతలు భూకంపాలూ, రోగాలూ తెచ్చిపెట్టి బాధిస్తారు' అని చెప్పేది.

హెర్మియా కబుర్లు వింటూంటే ఆ పనివాళ్లకు సరదాగానే ఉండేదిగాని వాళ్ళపైన పెత్తనం చలాయించే గ్రీకు సైనికులు 'పనిచెయ్యక కబుర్లు చెపుతున్నారా?' అని కోపపడి ముల్లుకర్రలతో పొడుస్తోండేవారు. హెర్మియా సానుభూతి కనబరచబోతే 'నీకెందుకమ్మా, ఈ ఇండియనుపందులగొడవ? వెళ్ళి నీపని చూసుకో' అనేవారు.

ఆమె యీడుపిల్లలెవరూ అక్కడ లేకపోవడంవల్లా, ఆ ఉన్నపనివాళ్ళతో గ్రీకుసైనికులామెకు కబుర్లు చెప్పనివ్వకపోవటంవల్లా ఆమెకు అంతగా అక్కడ ఊసుపోయేదికాదు. ఇలా ఉండగా, పుష్కలావతికి ఒక ఇరవైమైళ్ళదూరంలో మరొక గ్రీకుయోధుడు తన కుటుంబంతో కాపురం పెట్టేడని తెలియవచ్చింది.

హెర్మియా ఎగెయూసుతో, 'నేను నా చిట్టిగుఱ్ఱంమీద వాళ్లయింటికి వెళ్లివస్తాను' అంది. 'వెళ్ళవచ్చుగాని, అక్కడకు అడవిలోంచి వెళ్లాలి. మనమంటే కిట్టని ఇండియన్లు ఒంటరిగా వెడితే నిన్నుఎత్తుకుపోవచ్చు. అంతేగాకుండా అడవుల్లో దుష్టమృగాలు తిరుగుతోంటాయి. ఏ పెద్దపులైనా ఎదురైతే ఇంక ఏమైనా ఉందా? నిన్నొక్కర్తెనూ పంపటానికి వీల్లేదు. నీకంతగా వెళ్లాలని ఉంటే గ్రీకు సైనికుల్ని తోడిచ్చి పంపుతాను' అన్నాడు ఎగెయూసు.

వారానికొకమారు ఆమె తన చిట్టిగుఱ్ఱంమీద వెళ్ళి ఆ గ్రీకు కుటుంబంలోని పిల్లలతో ఆడుకుని వస్తోండేది. కూడా ఆమెకు అంగరక్షకులుగా ముగ్గురు గ్రీకుయోధులు గుఱ్ఱాలమీద వెడుతోండేవారు. ఒకమారు వారితోబాటు ఎగెయూసుకూడా వెళ్లాడు. అక్కడ అతగాడికి వాళ్ళు మంచి ద్రాక్షసారాయిని త్రాగటానికిచ్చి ఆదరించారు. హెర్మియాతో, 'ఇంక వారం వారం నీతో నేనే వస్తాను.' అన్నాడు ఎగెయూసు. వాళ్ళిచ్చిన మద్యం అంత రుచిగా ఉందన్నమాట!

కాని ఎగెయూసు ఇంక మళ్ళీ అక్కడకు వెళ్ళనేలేదు పాపం. ఏమంటే హెర్మియా, తిరిగి వచ్చేటప్పుడు అడవిలో ఒక గమ్మత్తు చేసింది.

(ఇంకా ఉంది.)

(పెద్దకథ)

# [illegible]

## 4

హెర్మియా ఎక్కిన చిట్టిగుఱ్ఱం చాలా చిన్నదీ చురుకైనదీని. హెర్మియా పదేళ్ళపిల్లయే గనక, గుఱ్ఱానికి ఆ బాలిక తన నడ్డిమీద ఉన్నట్టే అనిపించ లేదు. ఎగెయూసూ, తక్కిన యోధులూకూడా— ఒడ్డూ పొడుగూ ఉన్న మనుషులు. వాళ్ళ గుఱ్ఱాలు కూడా మాంచి ఎత్తైనవి. అవి తమ శరీరాలూ, తమపై నున్న యోధుల శరీరాలూ మోసుకురావటంలో చిట్టి గుఱ్ఱంకంటే కొంచెం వెనకపడిపోయాయి. తాను ముందూ, వాళ్లు వెనకా అవటంతో హెర్మియాకి ఒక కొంటె ఆలోచన కలిగింది. ఆమె ఉన్నట్టుండి, గుఱ్ఱం ప్రక్కలను రికాబులతో నొక్కి, కొరడాతో ఒక్కటి వేసి, "ఛల్, చల్" అనేసరికి అది వాయువేగాన పరుగెత్తసాగింది.

యోధులతో తాను పుచ్చుకున్న ప్రాతః పారాయాన్ని వర్ణిస్తో మెల్లిగా గుఱ్ఱాన్ని నడుపుకుంటూ వస్తోన్న ఎగెయూసు ఉలిక్కిపడి, 'హెర్మియా, ఏమిటా తొందర? ఆగు. అడవి అన్నమాట మరిచిపోకు. ముందు వెళ్లి దారితప్పేవంటే కొంప మునిగిపోతుంది!' అని అరిచాడు.

ఆమె వానిమాట వినిపించుకోలేదు. కొంటెగా నవ్వుతో, 'చేతనైతే మమ్మల్ని పరుగులో అందుకోండి చూస్తాను!' అంటూ పందెంకట్టి, 'చల్, చల్, చలో' అంటూ, రికాబులు నొక్కుతో కొరడాతో మధ్యమధ్య తగిలిస్తో చిట్టి గుఱ్ఱాన్ని హెచ్చరించేసరికి, ఆ బాలిక చేస్తోన్న తమాషా అర్థమైనదానికి మల్లేనే ఆ గుఱ్ఱంకూడా చురుగ్గా ఎగిరి దౌడుతీసింది.

ఎగెయూసు కంగారుగా, 'హెర్మియా, ఆగు, ఆగు!' అంటూ అరుస్తో తన అరబ్బీగుఱ్ఱాన్ని పరుగెత్తించాడు కాని చిట్టిగుఱ్ఱాన్ని అందుకోలేకపోయాడు. చెట్టుకొమ్మలు క్రిందగా ఉన్న దట్టమైన అడవి అవటంవల్ల, ఎక్కడ ఆ కొమ్మలు తగులుతాయో అన్న భయంతో ఎగెయూసూ, మిగతా ఇద్దరూకూడా జాగ్రత్తగా వంగివంగి వెళ్లవలసి వచ్చింది. చిట్టి హెర్మియాకూ ఆమె స్వారిచేస్తోన్న చిట్టి గుఱ్ఱానికీ అట్టిభయం లేదుగనక, వాళ్లు దూసుకుపోతోన్న బాణానికి మల్లే ఆ అడవిదారమ్మటే ముందుకు చొరుచుకుపోయి, మొదట కనుచూపుమేరలో ఉండి మరుక్షణంలో ఇట్టే మాయమైపోయారు.

పిల్ల లేమైపోతారో అన్న ఆదుర్దా పెద్దలకున్నంతగా తాము ఏమైపోతామో అన్న భయం పిల్లలకు ఉండదు. అందులో హెర్మియాకు అలాంటి బెదురు ఎన్నడూ లేదు. ఏమంటే ఆమె స్వతహాగా ధైర్యమైన బాలిక. అప్పటికప్పుడే ఆమె ఆ గ్రీకు కుటుంబం ఉన్న చోటుకు చాలాసార్లు వెళ్లి వచ్చింది గనుక ఆ అడవిదారి ఆమెకు బాగా అలవాటైంది కూడాను. ఇంతవరకూ ఆమె కా ప్రయాణాలలో ఏ క్రూరమృగం తారసపడలేదు. అందువల్ల ఆమెకు ఆ భయంకూడా తెలియదు.

ఆమె వెళ్ళివెళ్ళి, 'ఇంక ఆగుదాం. ఆ మలుపులో చెట్టుప్రక్కన గుఱ్ఱాన్నిదాచి, నేను చెట్టు

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

మొగలో దాక్కొని వెతుక్కుంటూ వస్తోన్న ఎగయూసుమీదకురికి హడలగొడతాను! మొదట కోపపడ్డా, నేనంటే గారం గనుక ఏమీ చెయ్యడు'' అనుకుని ఆ కొంటెబాలిక మళుపులో గుఱ్ఱాన్ని ఆపబోయింది.

కాని ఆమె ఒకటి తలుస్తే దేవుడొకటి తలచాడన్నట్లైంది. ఆ ప్రక్కనున్న పొదలో పిల్లలకు పాలిచ్చుకుంటూన్న అడవిపంది ఒకటి మహావేగంలో వస్తోన్న గుఱ్ఱం డెక్కలచప్పుడు విని బెదిరి ప్రాణభీతితో లేచి పారిపోబోయి పిల్లలతోసహా దారి కడ్డంగా వచ్చింది హఠాత్తుగా ఆ మృగాన్ని చూసి గుఱ్ఱం బెదిరిపోయి పక్కకొక గెంతుగెంతి పొదలనక పుట్టలనక, అడవిలోకి పారిపోయింది. స్వారిచెయ్యటంలో ఆరితేరింది గనుక హెర్మియా ఆ గుఱ్ఱాన్ని ఎలాగో అంటిపెట్టుకుని ఉంది గాని మరొకతెఐతే ఆ దూకుడులో గుఱ్ఱంమీద నుంచి పడిపోయేఉండును.

చిట్టిగుఱ్ఱం భయంతో అలాగ పారిపోతోనే ఉంది 'దారితప్పి సాంద్రారణ్యంలోకి చొరుచుకుపోతోంది గుఱ్ఱం అని తెలవటంతోనే హెర్మియాకు ఆదుర్దా ప్రారంభమైంది. తన శక్తినంతా వినియోగించి ఆమె గుఱ్ఱాన్ని ఆపటానికి ప్రయత్నించింది. కళ్ళేలు బిగించింది, గుఱ్ఱాన్ని తిట్టిపోసింది, మెల్లిగా మంచిమాటలతో బ్రతిమాలింది. కాని లాభం లేకపోయింది. హడిలిపోయిన ఆ గుఱ్ఱం ఆగకుండా దారి తెన్నూ లేని అరణ్యంలోకి పారిపోతూనే ఉంది.

పాపం హెర్మియా అలసిపోయింది ఏమి




చెయ్యాలో తెలియక కంగారుపడుతోన్న ఆ బాలికకు క్రిందగా ఉన్న లావాటి మఱ్ఱికొమ్మ ఒకటి అడ్డువచ్చి తగిలి ఆమె టఫీమని గుఱ్ఱంమీదనుంచి పడిపోయింది. ఆమెకు బలమైన గాయం తగిలి వెంటనే స్మృతితప్పి మూర్ఛపోయింది. ప్రాణభీతిలోఉన్న గుఱ్ఱం ఏమి జరిగినదీ తెలుసుకోకుండానే ఆమెను వదలి అడవిలోకి చొరుచుకు పారిపోయింది.

ఎగెయూసూ వాని అనుచరులూ, చూస్తోండగానే ఇట్టే మాయమైన హెర్మియాకోసం అడవి గాలించారుకాని ఆమెజాడ కనుక్కోలేకపోయారు. ఎడారులలోనూ అడవులలోనూ తప్పిపోయినవాళ్లని కనుక్కోడం అసాధ్యం. తన యజమాని ఏకైక కుమార్తె కనపడకపోవటంతో ఎగెయూసుకి మెడమీద తల నరుక్కుపోతూన్నట్లు అనిపించింది. భయంతోబాటు ఏదో చెప్పలేని బాధకూడా వేధించింది వాణ్ణి. ఎప్పుడూ రోహీలను యుద్ధాలలో తిరుగుతోంటే, ఆ తల్లిలేని హెర్మియాను ఎగెయూసే పెంచాడు. ఆ పిల్ల తప్పిపోయిందనేసరికి సొంతకూతుర్ని పోగొట్టుకున్నట్లే విలపించాడు.

## 5

బలమైన దెబ్బతగిలి స్మృతితప్పిన హెర్మియాకి ఎవరిదో చల్లనిచేయి నుదుటిపైన తగిలినట్లై, ఆమె కళ్లు తెరిచింది. ఆమెవైపు చూస్తో పదహారేళ్ల బాలుడొకడు నిలబడి ఉన్నాడు.

వాడి చూపులో క్రౌర్యం లేదుగనక వాడంటే ఆమెకు భయం వెయ్యలేదు. నల్లటి పొడుగాటిజుట్టు వాడిది. కాని దాన్ని వాడు రోజూ దువ్వుకొని చిక్కు తీసుకుంటూన్నట్టు లేదు. వాడు కట్టుకున్నబట్టలు కూడా మాసి చిరుగులతోఉన్నాయి. వాణ్ణి చూడటంతో ఎవడో బీదభారతీయబాలు డనుకుంది హెర్మియా.

తానొక గొప్పవానికూతురు గనుక హెర్మియా కోపంతో, 'నన్ను నువ్వెందుకు ముట్టుకున్నావ్?' అని గ్రీకుభాషలో అడిగింది.

వాడూ వచ్చీరాని గ్రీకుభాషలో సమాధానం చెప్పేడు. "నేనుకాదు ముట్టుకుంట. ఇదిగో ఈ ఆకు." అన్నాడు వాడు. ఆ ప్రక్కనే ఉన్న పొడుగాటి ఆకును తీసి చూపుతో, "ఈ చల్లని ఆకును నీ నుదుటిపైన పెడితే నీకు మూర్ఛలోంచి తెలివి వస్తుందని చేశాను." అన్నాడు. వాడు గ్రీకుభాషలో యాసగా మాట్లాడుతోంటే హెర్మియాకి ఆ బాధలోకూడా కొంచెం నవ్వు వచ్చింది. తనకు మేలు తలపెట్టినవాడికి కృతజ్ఞత చెప్పకోడానికి బదులు కోప్పడ్డందుకు ఆమె సిగ్గుతో చిమిడిపోయింది. కాని గొప్పయింటిబిడ్డ గనక గంభీరంగానే, 'సరే ఐతే. నువ్వెవరవు?' అని అడిగింది.

"నన్ను 'హారప్రియుడు' అంటారు. మా తండ్రిగారి పేరు 'విశ్వజిత్తు'" అన్నాడు వాడు.

'విసుజిసా?' అంది ఆమె ఆలోచిస్తో.

"'విసుజిసు' కాదు; విశ్వజిత్తు. పుష్కలావతి రాజు." అన్నాడు హారప్రియుడు.

ఆమాట వినటంతోనే హెర్మియా కొన్ని క్షణాలు మౌనంతో ఉండిపోయింది. పుష్కలావతి కోటలోనే తా నిప్పుడు నివసిస్తోంట. గ్రీకులు ఆ కోటను లాక్కోవడంతోనే విశ్వజిత్తూ, ఆయన కుటుంబమూ అడవులపాలయారు.


ఆమె కేమాటా తోణక్క 'సరే. నా గుఱ్ఱం ఎక్కడుందో చూసి తీసుకురా. నేను మాయింటికి పోవాలి.' అంది. ఆ అనటం, ఒక గొప్పయింటిబిడ్డ తన నౌకరుకు ఆజ్ఞాపించినట్లుగా ఉంది.

'నీ గుఱ్ఱమా? పట్టుకోపోయానుగాని, దొరికింది కాదు. పారిపోయింది' అన్నాడు హారప్రియుడు.

'పోతే మరొకగుఱ్ఱాన్ని తీసుకురా వెళ్లి. నేను అడవిలో తప్పిపోయానని ఎగెయూసు కంగారుపడతాడు,' అంది హెర్మియా.

తానూ ఒక రాజకుమారుడే గనుక హారప్రియుడికి ఆమె అధికారం చెలాయించటం చూస్తే మొదట కొంచెం కోపం రాకపోలేదు. కాని వెంటనే, 'చిన్నపిల్ల! ఎలాగ మాటాడాలో ఇంకా తెలియదు.' అని సర్దుకుని చిరాకంతా చిరునవ్వుగా మార్చుకున్నాడు.

వాడు కదలకుండా అక్కడే నిలబడ్డం చూసి ఆమె కోపంతో లేచి, పోబోయింది. కాని గుఱ్ఱంమీదనుంచి పడటంలో ఆమె చీలమండకు దెబ్బ తగలడం వల్ల ఆమె నిలబడలేకపోయింది. నొప్పితో కూలబడి వచ్చే కన్నీటిని ఆపుగోటానికి ప్రయత్నిస్తో, 'నాకు దెబ్బకూడా తగిలింది. గుఱ్ఱాన్ని తెచ్చిపెట్టు. నే నింటికి పోవాలి' అంది.



హరిణవిహారం. ఫొటో : విఠల్ ప్రసాద్—మద్రాసు.

# ★ హిరణ్మయి ★

'ఎక్కడనుంచి తెమ్మంటావ్? మాకు ఒకప్పుడు ఎన్నో గుఱ్ఱాలు ఉండేవి కాని ఇప్పుడేమీ లేవు మరి.' అన్నాడు హారప్రియుడు.

'ఆలస్యమైపోతోంది. మావాళ్లు నాకోసం ఎదురుచూస్తుంటారు. నన్ను మాయింటికి ఎలాగైనా చేర్చాలి.' మళ్లీ అంది హెర్మియా. ఈమారామె హారప్రియుణ్ణి ప్రాధేయపూర్వకంగానే అడిగింది.

'నీకేమి సాయంచెయ్యమన్నా చేస్తానుగాని నేను నీతోవస్తే మీగ్రీకుపందులు నన్నుచూసి, చంపేస్తారు!' అన్నాడు హారప్రియుడు.

'గ్రీకులు పందులు కాదు. మరి ఎగెయాసు ఇండియన్లే పందులన్నాడు.' అంది హెర్మియా.

హారప్రియుడు ఉద్రేకంతో, 'గ్రీకులే మృగాలు! క్రూరమృగాలు! మమ్మల్ని అడవులపాలుచేసి, మా కోటను ఆక్రమించుకున్నారు దుర్మార్గులు! మీ గ్రీకులంటే నాకు అసహ్యం. మీరు బందిపోటుదొంగలకన్నా అధములు!' అన్నాడు.

హెర్మియా మాట్లాడలేదు. హారప్రియుడికి కూడా మరుసటిక్షణంలో కోపం, ఉద్రేకం చల్లారి, 'ఈ చిన్నపిల్ల ఏంచేసిం దింతకీ?' అనుకున్నాడు. ఆతడు ప్రసన్నుడు కావటంతోనే ఆమె మళ్ళీ, 'నన్ను మా బసకు చేర్చవూ?' అంది.

'నువ్వెక్కడ ఉంటున్నావు?' అన్నాడు హారప్రియుడు.

'పుష్కలావతికోటలో' అని, ఆమె చటుక్కున నాలుక కరుచుకుంది.

ఆమె తమకోటను ఆక్రమించుకున్న గ్రీకుల పిల్ల అని తెలవటంతోనే హారప్రియునిముఖం ఎఱ్ఱబారింది. కాని హారుడు హాలాహలాన్ని మ్రింగినట్లుగా కోపమంతా దిగమ్రింగుకుని, 'ఇక్కడకు పుష్కలావతి

చాలాదూరం. అంతవరకూ నువ్వు నడవలేవు. నీ కాలికి దెబ్బతగిలింది కూడాను.' అన్నాడు.

'ఎలాగ మరి? నన్నెలాగైనా మావాళ్ళదగ్గిరకి చేర్చు. ఎగెయాసుతో చెప్పి నీకు డబ్బు ఇప్పిస్తాను.' అంది హెర్మియా.

'మీడబ్బు నాకక్కర్లేదు. కుంటుతో నువ్వు ఇంతదూరం ఎలాగ నడవగలవు అని ఆలోచిస్తున్నానంతే' అన్నాడు హారప్రియుడు. ఒక్కక్షణం ఆలోచించి, 'ఇక్కడింక మనం ఆలస్యం చెయ్యటానికి వీల్లేదు. చీకటిపడుతోంది అడవిలో క్రూరమృగాలు మసిలేవేళ ఔతోంది. నాతో మాయింటికి రా. నిన్ను మీయింటికి ఎలాగ పంపేదీ మా అమ్మతో ఆలోచిద్దాము.' అన్నాడు.

"అమ్మోయ్, మీయింటికే? నేను రాను. మా గ్రీకులంటే అసహ్యమన్నావు నువ్వు! తీసుకెళ్లి నాకేమి హానిచేస్తావో? 'ఇండియన్లు కసాయివాళ్లు' అన్నాడు మా ఎగెయ్యాసు " అంది హెర్మియా.

'ఐతే ఇక్కడే ఉండు! నే వెడుతున్నాను. కాస్సేపటికి పులులూ, తోడేళ్లూ, అడవిపందులూ వస్తాయి.' అంటూ హారప్రియుడు పోతూన్నట్లుగా నటించాడు

'వెళ్లిపోకు! నేను నీతో వస్తాను నువ్వు మంచివాడివిలాగే ఉన్నావు గనుక నువ్వంటే నాకు భయం లేదు కాని మీవాళ్లు నన్నేమీ చెయ్యరుకదా?' అంది హెర్మియా

'నీవంటి చిన్నపిల్లల్ని బాధించేటంత దుర్మార్గులుకాదు మావాళ్లు. మా అమ్మ రాణీ గాయత్రీ దేవి ఎంతమంచిదో నువ్వే చూద్దువుగాని. నీకాలికి తగిలిన గాయానికి ఆమె మందువేసి కుదురుస్తుంది. మా క్షమావతి చాలా సరదా ఐనది ' అన్నాడు హారప్రియుడు.

'క్షమావతి ఎవరు?' అంది హెర్మియా.

'మా చెల్లెలు. నీకంటే కొంచెం పెద్దది నీకు మల్లేనే చాలా అందంగా ఉంటుంది ' అన్నాడు హారప్రియుడు

'అలాగైతే తప్పకుండా వస్తాను మీ క్షమావతికి కుట్టుపని చేతనౌనా? మీ కథలన్నీ వచ్చా?' అంది హెర్మియా

'వచ్చు లే ... మాయింటిదాకాకూడా నువ్వు నడిచేటట్లులేదు నీకాలు చూస్తే. ... ఒకపని చెయ్యి, చెపుతాను. నీ రెండుచేతులతోనూ నా మెడ పట్టుకో నిన్ను ఎత్తుకు తీసుకువెడతాను' అన్నాడు హారప్రియుడు.

'అక్కర్లేదు. నడుస్తాను ' అంటూ ఆమె మొహమాటంకొద్దీ రెండడుగులు వేసిందికాని లాభం లేకపోయింది. హారప్రియుడు తన బలమైన చేతులతో ఆ బాలికను ఎత్తి, చరచరా తమ గుహవైపునకు నడిచాడు.

## 6

విశ్వజిత్తు ఉండే గుహలోని నేలభాగం చదునైనదిగాక మిట్టపల్లాలతో ఉంది. బైటనుండి వెలుతురు రావటానికికాని, లోపలనుండి పొగపోవటానికికాని మార్గంలేక అంతా చీకటికోణంగా కనపడి, హెర్మియాకు భయంవేసింది.

ఆమె కాగుహలోనివాళ్లెవరూ మొదట కనపడలేదు. లోపలనుంచి సంస్కృతభాషలో మాట్లాడుతోన్న ఒక స్త్రీకంఠం వినవచ్చింది. హారప్రియుడు తిన్నగా ఆమెవద్దకు పోయి హెర్మియాను ఆమెముందు దింపి, 'అమ్మా, ప్రస్తుతం పుష్కలావతిలో ఉన్న గ్రీకుయోధుని కూతురీ అమ్మాయి అడవిలో తన గుఱ్ఱంమీదనుంచి పడిపోయి కాలుకు దెబ్బతగిలి కదలలేకుండాఉంటే ఇక్కడకు తీసుకొచ్చాను ' అన్నాడు.

ఆమె రాణీ గాయత్రీదేవి. తాను కూర్చుని ఉన్న ముక్కాలుపీటపైనుండి లేచివచ్చి, హెర్మియా చెయ్యిపట్టుకుని ఆమె గ్రీకుభాషలో మెల్లిగా, 'నీపేరు ఏమిటమ్మా?' అని అడిగింది.

ఆ బాలిక బెదురుతో, 'హెర్మియా' అంది.

'హెర్మియావా ? చాలా మంచిపేరు'' అని మెచ్చుకుంది గాయత్రిదేవి

ఆమాట వినపడి క్షమావతి అక్కడకు వచ్చి' 'ఏమిటమ్మా? హిరణ్మయా?' అంది.

గాయత్రీదేవి నవ్వుతో, "కాదు; 'హెర్మియా'ట మనం 'హిరణ్మయి' అనే పిలుద్దాం పోనీ." అంది.

'అంటే ఏమిటి?' అని అడిగింది హెర్మియా.

"'హిరణ్మయి' అంటే 'బంగారుతల్లి' అన్నమాట. నువ్వు 'బంగారుతల్లి 'వే గనుక నిన్నింక మేము 'హిరణ్మయి' అనే పిలుస్తాం." అంది గాయత్రీదేవి.

తాను పుష్కలావతికోట న్నాక్రమించుకొన్న



ఇసుకలాట

ఫొటో: బి. రంగనాథన్—మద్రాసు.

రోహిలసు కుమార్తెనని తెలవటంతోనే ఆ గుహలోని వాళ్లు మండిపడతారనుకుంది హెర్మియా. అటువంటి దేమీ జరక్క వాళ్లు తనను 'బంగారుతల్లి' అని పిలవటం చూస్తే హెర్మియాకు చాలా ఆశ్చర్యం వేసింది.

ఆ గుహలో మినుకుమినుకుమంటూ ఒక్కటే దీపం ఉంది. మొదట హెర్మియాకు అంతా చీకటి మయంగా ఉన్నా క్రమంగా ఆ గుహలోని సామాను ఒక్కొక్కటే కనపడింది. ఒకప్పుడు భోగం అనుభవించిన ఆ రాజకుటుంబం ఇప్పుడా గుహలోఉండి ఎంత బాధపడుతోన్నదీ ఆమె గ్రహించకలిగింది.

"నామూలాన మీకు ఎంతో ఇబ్బంది కలుగుతుంది. నా గుఱ్ఱం ఎక్కడుందో వెతికి తెచ్చి, నన్ను మా బసకు చేర్చమంటే వినక మీ అబ్బాయి నన్నిక్కడకు తీసుకొచ్చాడు." అంది హెర్మియా, ఏదో నేరం చేసినదానికి మల్లే.

'మాకు నీవల్ల వచ్చే ఇబ్బం దేమీ లేదు. దెబ్బ ఎక్కడ తగిలింది? బాగా నొప్పిగా ఉందా?' అని అడిగింది గాయత్రీదేవి.

'నొప్పిగానే ఉంది. త్వరగా నొప్పితగ్గి, మా యింటికి పోగలిగితే బాగుండును. మా ఎగెయూసూ, హిపోలిటా నే నేమైపోయానో అని బాధపడుతోంటారు.' అంది హెర్మియా.

'గాయం తగ్గటంతోనే వెళ్లిపోదుగానిలే ... కుమారావతీ, కొంచెం నీరు తే.' అంది గాయత్రీదేవి.

హెర్మియా గాయాన్ని గాయత్రీదేవి ఆ నీటితో కడిగింది. ఆకుపసరేదో తెచ్చి ఒక గుడ్డపేలికను అందులో ముంచి, దెబ్బతగిలినచోట వేసి కట్టుకట్టింది. 'కాలు నేలమీద మోపకుండా, పడుండు.' అని, కంబళీ ఒకటి తెచ్చి పరిచింది.

హెర్మియా, 'ఈ రాణీ ఎంత మంచిదీ.' అనుకుంటూ కంబళీవద్దకు నడిచి వెళ్ళబోయింది. రాణీ, 'ఉండు.' అంటూ ఆమెను ఎత్తుకు తీసుకు వెళ్ళింది.

చైనీస్ కథలు - ఫెంగ్ స్వే ఫెంగ్:

# 8. ఎవరు దౌర్జన్యవాది?

ఒకనక్క కుందేలును తరుముతోంది కుందేలు నక్కకి అందకుండా అతివేగంగా పరిగెత్తుతూ, నక్కచుట్టూ వలయాలుగా తిరుగుతూ దానికి బాగా అలసట కలగజేసింది నక్కకి వొళ్లంతా చెమటలు పోసి, గుండ్రంగా తిరగడంచేత కళ్లు తిరిగి పడిపోయేస్థితి వచ్చింది ఇంతలో కుందేలు చటుక్కున దగ్గరలో ఉన్న ఒక ముళ్ళపొద అడుగున కన్నం చేసుకుని లోపలికి దూరిపోయింది

కుందేలు ముళ్లపొదలో దాక్కుందని కోపంతో నక్క ఒక్క దూకు దూకింది. ఇంకేముంది? శూలాల్లాగ వాడిగా, పొడుగ్గా పెరిగిన ముల్లు నక్కకు గుచ్చుకుని, అది గాలిలో వేళ్ళాడుతూ గిలగిల తన్నుకోసాగింది. తన్నుకున్నకొద్దీ నెత్తురు ప్రవహించసాగింది.

నక్క మితిమీరిన కోపంతో కుందేలును తనకు చేతనైనన్ని రకాలుగా తిట్టిపోసింది: "వెధవ! దొంగ! నిరాయుధుణ్ణి చేసి నామీద దౌర్జన్యం చేస్తున్నాడు. పచ్చి నెత్తురు తాగే హింసావాది! కష్టాల్లో పడి నిస్సహాయులై పోయినవాళ్ళని హింసించే ఘాతుకుడు! నాస్తికుడు!

ఈలోగా కుందేలు కన్నంలోంచి బయటికి వచ్చి వెళ్లిపోతూ వెనక్కి తిరిగి "అంతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా తిట్లు? కాని నీపాండిత్యాం చూస్తే నాకు భక్తి కలుగుతోంది ఇప్పుడు నువ్వు చదివిన చదువు ఉందే, అది అక్షరాలా నీకు అతికించినట్టు సరిపోతుంది. సరే, మంచిది, వెళ్లొస్తాను. టా, టా!" అని తనదారిన పోయింది ★

---

ఆ బాలిక చిన్నహృదయం కృతజ్ఞతతోనిండి ఆమెకళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి. రాణీ, 'ఏమమ్మా చాలా నొప్పిగా ఉందా?' అని అడిగింది. హెర్మియాకు ఏమిచెప్పాలో తోచలేదు.

కుసూవతి వచ్చి తల్లి చెవిలో, 'అమ్మా, ఇంట్లో గోధుమరొట్టెలుతప్ప మరేమీ లేదు. ఈ అమ్మాయికి రొట్టె ఇష్టమో కాదో మరి ' అంది.

'ఇవాళకు అదే పెట్టు మరి రేపు ఆమెకు ఇష్టమైన దేదైనా తెప్పించి పెడదాం.' అంది రాణి. ఆ సంభాషణ వినపడ్డ హెర్మియా 'నాకు రొట్టె ఇష్టమే,' అంది

ఆమెకు బాగా ఆకలివేయడంవల్ల, ఆ ముతక రొట్టె అంత బాగుండకపోయినా తినేసింది

ఆమె పడుకున్నాక, రాణీ మరొక కంబళీని తెచ్చి ఆమెకు కప్పింది. ఆమెకు వెంటనే నిద్ర రాలేదు. కుసూవతి వచ్చి ఆమెప్రక్కన కూర్చుంది 'మీ తండ్రి ఎక్కడ?' అని అడిగింది హెర్మియా

కుసూవతి, 'అదుగో ఆప్రక్కనైన నిద్ర పోతున్నారు. ఆయనకు జబ్బుగా ఉంది.' అని, అటువైపు చూపింది

'ఆ అవ్వ ఎవరు?' అని అడిగింది హెర్మియా

"ఆమెపేరు రోహిణి. మేం పుష్కలావతిలో ఉన్నప్పుడు మమ్మల్ని పెంచిన దాది ఆమె 'వద్దు' అన్నా. వదలలేక మాతో వచ్చేసింది " అంది కుసూవతి.

అంతలో విశ్వజిత్తు మేల్కొని, 'దాహమ్మరా!' అని నీరసంగా పిలిచాడు

'మీనాయన పిలుస్తున్నారు 'అంది హెర్మియా.

'మా అమ్మ వెడుతోంది ' అంది కుసూవతి

విశ్వజిత్తు, 'ఎవరిదీ కొత్తకంఠం వినపడుతోంది?' అని అడిగాడు గాయత్రీదేవి హెర్మియాసంగతి చెప్పింది ఆతడేమీ అనకుండానే మళ్ళీ కప్పుకొని నిద్రపోయాడు.

దాది రోహిణి అప్పుడు పొయ్యిలో నిప్పువేసి వంట ప్రారంభించింది.

'ఇంత రాత్రి అయాక వంట మొదలెడుతోం దేమిటి? రొట్టెలున్నాయిగా తినటానికి?' అని అడిగింది హెర్మియా.

'ఆ వంట ప్రొద్దున్నకి. పగలు వండుతే పొగ బయటవాళ్ళకి కనపడి మేం ఈ గుహలో ఉన్నట్లు గ్రీకులకు తెలిసిపోతుంది. అందుచేత మేము రాత్రి పూటే వండుకుంటాం.'

'హెర్మియా మాట్లాడలేదు. 'మా గ్రీకులు వీళ్ళకి చాలా అన్యాయం చేశారు ఈ ఇండియన్లు ఎంత మంచివాళ్లు?' అన్న ఆలోచనలో పడిం దామె. "ఇంక వీళ్ళని 'పందు' లంటూ ఏ[illegible]కూడదని ఎగెయూసుతో గట్టిగా చెప్తాను." అనుకుంటూ ఆమె నిద్రపోయింది.

(ఇంకా ఉంది)

(పెద్దకథ)

# హిరణ్మయి

## 7

మర్నాడు మేల్కొనటంతోనే హెర్మియా పుష్కలావతికి పోవాలనుకుంది. కాని పాదం బాగా వాచి, ఆమె అడుగు క్రిందమోపలేకపోయింది.

'నీ పాదం నయమవటానికి కొన్నాళ్లు పడుతుందమ్మా' అంది గాయత్రీదేవి.

"మా ఎగెయూసు నేను కనపడకపోతే బెంగతో పిచ్చెత్తిపోతాడు. మీ అబ్బాయిని పంపి 'నే నిక్కడ ఉన్నా'నని చెపితే ఎగెయూసు వచ్చి నన్ను తీసుకు వెడతాడు" అంది హెర్మియా.

"నిజమే కాని మేము ఈ గుహలో తల దాచుకున్నట్లు ఎవరికీ తెలియకూడదు. నయమవడంతోనే నిన్ను సురక్షితంగా అక్కడకు పంపుతాను" అంది గాయత్రీదేవి'

హెర్మియా చేసేదిలేక 'సరే'అంది. సిగ్గువల్లనో ఎందుచేతనో గాని హారప్రియుడు ఆమెతో తరుచూ మాట్లాడేవాడు కాదు. క్షమావతి మాత్రం ఆమెకు ఇట్టే ప్రాణస్నేహితురాలైంది.

ఆమె అంటే కిట్టనిది ఒక్క రోహిణికే. 'శత్రువుల పిల్లను ఇంత గారంగా చూడట మేమిటి? మనకిలాగో చిక్కింది గనుక ఈపిల్లను ఖైదీగా చెయ్యాలి! పుష్కలావతి తిరిగీ మనవశమయేవరకూ ఈ పిల్లను మనం వాళ్ళదగ్గరకు పంపకూడదు!' అన్న దామె.

'గ్రీకులవల్ల మనకు అన్యాయం జరిగినమాట నిజమే. కాని ఈపిల్ల ఏంచేసింది పాపం? నమ్మి మన పంచచేరినవాళ్ళని మనవాళ్ళకుమల్లేనే చూసుకోవాలి.' అంది గాయత్రీదేవి.

'ఈవిడ పాములకుకూడా పాలుపోసి పెంచమంటుంది!' అని గొణుక్కుంది రోహిణి.

రోజులు గడిచినకొద్దీ ఆ కుటుంబంవాళ్ళంటే హెర్మియాకు ప్రేమా గౌరవం ఎక్కువయాయి. రాణీ గాయత్రీదేవి ఆ పిల్ల గాయాన్ని రోజూ కడిగి కట్టు కట్టేది. లభించినదాంట్లో మంచి ఆహారంతీసి ఆమెకు పెట్టేది. గొప్పఇంటి బిడ్డలు ఎంత సున్నితంగా పెరుగుతారో తనకు తెలుసును గనుక హెర్మియాకు ఉన్నంతలో ఏ లోపం రాకుండా చూసేది.

ఒకనాడు క్షమావతితో 'మీ అన్నయ్య నీకు ఎన్నో కథలు వచ్చునన్నాడు. ఒక్కటైనా చెప్పేవు కాదు.' అంది హెర్మియా

'సీత కథ చెప్పమన్నావా?' అంది క్షమావతి.

'సీత ఎవరు?'

'మిథిలా నగరపు రాజకుమార్తె, అయోధ్య రాజు కుమారుడైన శ్రీరాముని భార్య.'

'చెప్పు.'

క్షమావతి హెర్మియాకు రామాయణ కథ చెప్పింది. రావణాసురుడు సీతను ఎత్తుకుపోవడం, రాముడు వానరులతో సముద్రం దాటి వెళ్లి యుద్ధంలో రావణాసురుణ్ణి చంపేసి, సీతను విడిపించుకు రావటం విని, హెర్మియా, 'మాకూ ఇలాంటి పురాణం ఒకటి ఉంది. అది కూడా ఇలాగే చాలా బాగుంటుంది' అంది.

'ఏతే చెప్పు' అంది క్షమావతి. హారప్రియుడు

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

కూడా చేతిలో ఉన్న పనిమానేసి హెర్మియా ప్రారంభించిన కథ విన్నాడు.

'ట్రాయ్' అనే పట్టణం ఉండేది. ఆ పట్టణాన్ని 'ప్రియాం' అనే రాజు పాలించేవాడు. ఆయనకు చాలామంది కుమారులుండేవారు.' అంది హెర్మియా.

'పూర్వం రాజులకు చాలామంది కొడుకులుండేవారు కామోసు. మా ధృతరాష్ట్రుడికి నూరుగురు కొడుకులుండేవారుట' అంది క్షమావతి.

హారప్రియుడు అందుకుని, 'నూరు ఒక లెక్కా- సగర చక్రవర్తికి పద్ధానుగువేలమంది కొడుకులుండేవారట!' అన్నాడు.

'వాళ్ళ కథలు చెప్పరూ?' అని అడిగింది హెర్మియా.

'ముందు మీ 'ప్రియాం' కథ చెప్పు. తర్వాత మేం చెపుతాం.' అంది క్షమావతి.

'ప్రియాం' కొడుకులలో 'పారిస్' అనేవాడొకడు. మీ రావణాసురునికి మల్లేనే వాడు ఒక గ్రీకు రాజకుమారుని భార్యయైన 'హెలెన్' అనే అందగత్తెను ఎత్తుకు చక్కాపోయాడు.' అంది హెర్మియా.

'ఊఁ.'

'ట్రాయ్‌వాళ్లైన ట్రోజన్లకూ, మా గ్రీకులకూ గొప్పయుద్ధం జరిగింది.'

'ఆ యుద్ధంలో ఎవరు నెగ్గేరు?'

'గ్రీకులే నెగ్గేరు. ట్రోజన్లలో హెక్టరూ మొదలైన మహాయోధు లెందరో ఉన్నా జయం గ్రీకులకే లభించింది.' అన్నది హెర్మియా.

'ధర్మమే జయిస్తుంది. రావణుడు మహా పరాక్రమవంతుడైనా ధర్మబలం లేకపోవడంవల్ల ఓడిపోక తప్పిందికాదు.' అన్నాడు హారప్రియుడు.

'కాని గ్రీకులకు విజయం కలిగినా అంత సులభంగా రాలేదది. బాహుబలంతోబాటు బుద్ధిబలం కూడా వినియోగించవలసి వచ్చింది.' అంది హెర్మియా.

'ఏం చేశారు గ్రీకులు?'

'ఎంత శ్రమపడ్డా ట్రాయినగరం గ్రీకులకు స్వాధీనం కాలేదు. ప్రాణం విసిగి తిరిగిపోతూన్న వాళ్ళకిమల్లే నటించి తమ ఆయుధాలన్నీ ఓడల్లోకి ఎక్కించుకుని లంగర్లెత్తేసి ప్రయాణం కట్టారు గ్రీకులు. పోతూన్న గ్రీకు ఓడల్ని చూసి, ట్రోజన్లు 'మనల్ని ఏమీ చెయ్యలేక తిరిగిపోతున్నారు గ్రీకులు!' అని లేవిడీ కొట్టారు. సముద్రపుటొడ్డున గ్రీకు లేమైనా మరిచిపోయారేమో చూద్దామని తలుపులు తెరుచుకొచ్చి చూసేసరికి అక్కడ వాళ్ళకొక పెద్ద కర్ర గుఱ్ఱం కనపడింది.'

'కర్ర గుఱ్ఱమా?'

"ఔను. చాలా ఎత్తుగానూ,పొడుగ్గానూ ఉందా గుఱ్ఱం. ఆ గుఱ్ఱం బొమ్మనుచూసి ట్రోజన్లు మురిసిపోయారు. 'ఇలాంటి అందమైన ఈగొప్ప మానుగుఱ్ఱాన్ని మరిచిపోయారేమిటి గ్రీకులు!' అనుకుంటూ, చక్రాల బల్లకట్లపై తాపటం చేసిఉన్న ఆ మహా విగ్రహాన్ని బరబరా కోటలోపలకి ఈడ్చుకుపోయారు.'

'ఊఁ.'

'ఆ పగలల్లా విందు లారగించి కోట తలుపులు మూసి, రాత్రి హాయిగా నిద్రపోయారు ట్రోజన్లంతా.'

'ఊఁ.'

'అర్ధరాత్రి అయేసరికి మాను గుఱ్ఱం ప్రక్కలు రెండూ తలుపులకుమల్లే తెరుచుకుని గుఱ్ఱం కడుపులోంచి ఉక్కుతునకలలాంటి గ్రీకుయోధులు బిలబిలా బయటకు ఉరికేరు.'

క్షమావతి ఆశ్చర్యంతో 'కోటలో ప్రవేశించటానికి గ్రీకులు ఈ ఎత్తువేశారన్నమాట!' అంది.

'ఔను. ఆ యోధులు గబగబా వెళ్ళి కోట తలుపులన్నీ బారెట్టేశారు. పోయినట్టు నటించిన ఓడలన్నీ అప్పటికప్పుడే తిరిగివచ్చి సముద్రపుటొడ్డున సిద్ధంగా ఉన్నాయి. కోటతలుపులు తెరవటంతోనే ఓడలలోని గ్రీకులందరూ నిరాఘాటంగా ట్రాయి నగరం ప్రవేశించారు. త్రాగి మత్తుగా నిద్రలో పడి ఉన్న ట్రోజన్లు ఏం జరిగిందో తెలవక ఉలిక్కిపడిలేచి తొడ తొక్కిడిగా ఆయుధాలకోసం పరుగెత్తారు. ఆ యుద్ధంలో ట్రోజన్లు చాలామంది

ప్రాణాలు కోల్పోయారు. గ్రీకులకు విజయం లభించింది.' అని ముగించింది హెర్మియా.

## 8

కథలు చెప్పుకోవడంలో ఒకనాడు 'మినర్వా' ప్రశక్తి వచ్చింది. "మినర్వా ఎవరు?" అంది కుమావతి.

'మినర్వా అదృష్టదేవత.' అంది హెర్మియా.

'మా లక్ష్మీదేవిలాంటిదన్నమాట.' అంది కుమావతి. 'ధనంకోసం, ఐశ్వర్యంకోసం మేము లక్ష్మీదేవిని కొలుస్తాము.'

'ఆమె వరాలిస్తుందన్నమాట' అంది హెర్మియా.

'ఇస్తుంది. కాని ఆమెను మేము 'చంచల' అని కూడా అంటాము.' అంది కుమావతి.

'అంటే?'

" 'చంచల' అంటే ఉన్నచోట ఉండకుండా మారుతోంటేది అని అర్థం. ఒకప్పుడు లక్ష్మీదేవి మమ్మల్ని అనుగ్రహించి మాకు రాజ్యం, అంతఃపురాలూ ఇచ్చింది. ఆమె మనస్సు మారటంతోనే మమ్మల్ని వదలి ఇలాగ అడవులపాలు చేసింది." అంది కుమావతి.

కుమావతి తలవని తలంపుగా అన్న ఈ మాటలు హెర్మియా మనస్సును కలచివేశాయి. వాళ్ల అంతఃపురాలలో తాను ఉండటం తటస్థించిందన్న ఊహవచ్చి ఏదో నేరంచేసినదానికిమల్లే చిన్నబుచ్చుకుని, 'కుమా, మేం నిజంగా మీకు అన్యాయమే చేశాము.' అంది.

కుమావతి తానన్న మాటకు వెంటనే నొచ్చుకుని, 'హిరణ్మయీ! మాటల సందర్భంలో ఏదో అన్నాను గాని, నీ మనస్సుకు నొప్పి కలగాలని కాదు. మనం చిన్నపిల్లలం. ఈ యుద్ధాలూ దండయాత్రలూ మన చేతుల్లో లేవు.' అంది.

'ఓడిపోయినా గుహాలలో ఉండి మీకుమల్లే కష్టపడక్కర్లేదుకదా. మా నాన్న వచ్చాక మీ సంగతి ఆయనతో చెపుతాను.' అంది హెర్మియా.

'మీ నాన్న ఏం చెయ్యగలరు? సెల్యూకసుకు మేమంటే కిట్టదు. మా నాయన అలెగ్జాండరు చక్రవర్తికి పంపుకున్న అర్జీని ఆ దురాత్ముడు చక్రవర్తికి అందనివ్వక మాపై లేనిపోని నేరాలుమోపి అడవులపాలు చేశాడు.' అంది కుమావతి.

వాళ్ళు ఆరోజున ఇంక కథలేమీ చెప్పుకోలేదు. కుమావతి పుల్లలూ, చితుకులూ ఏరి తేవటానికి అడవిలోకి వెళ్ళింది. హారప్రియుడు దుంపలు తవ్వి తేవటానికి వెళ్లేడు. ప్రొద్దుటనుంచీ చాకిరీ చేసి అలసట చెందిన గాయత్రీదేవి కూర్చున్నచోటే నడుం వాల్చి కన్నుమూసింది. రోహిణి ఏదో పనిచేసుకుంటూంది.

ఆ సమయంలో విశ్వజిత్తు మేల్కొని,' దాహం, మరా.' అని పిలిచాడు.

హెర్మియా వెంటనే లేచి కుంటుకుంటూ వెళ్లి విశ్వజిత్తుకు మంచినీళ్ళపాత్రను అందించింది. 'ఇంకా కొంచెం నీరు కావాలా? మీకు సులువుగా ఉందా?' అని అడిగింది. ఆ మాటవిని గాయత్రీదేవి లేచింది. 'ఏమమ్మా, నువ్వే వచ్చావా? నన్ను లేపలేకపోయావా? కుమావతి లేదా?' అందామె. 'నేనూ కుమావతిలాంటిదాన్నే కదా మీకు?' అంది హెర్మియా నవ్వుతో. గాయత్రీదేవి సంతోషంతో ఆ బాలికను కౌగలించుకుంది.

ఇప్పుడు రోహిణికికూడా హెర్మియా అంటే ఇదివరకుమల్లే కిట్టకపోవడమనేది లేదు. ఆమె, 'ఈ పిల్ల చాలా మంచిది. గ్రీకులలో పుట్టవలసినది కాదు!' అంది. గ్రీకులంతా రాక్షసులే అని రోహిణి అభిప్రాయం.

## 9

క్రమంగా కొన్నాళ్ళకి హెర్మియా పాదం నయమైంది. ఆమె బాగా నడవగలిగాక ఒకనాడు 'ఇంక నన్ను మా యింటికి పంపించెయ్యండి.' అని గాయత్రీదేవి నడిగింది.

'హారప్రియుణ్ణి సాయమిచ్చి పంపుతాను. రాత్రిపూట అడవిలోంచి వెళ్ళటానికి భయంలేదుకదా?' అని అడిగింది గాయత్రీదేవి.

'భయంలేదు. కాని పగటిప్రయాణమంటేనే నాకు సరదా' అంది హెర్మియా.

'నిజమేకాని అది మాకు మంచిదికాదు. హారప్రియుణ్ణి గనక ఎవరైనా చూశారంటే మా గుహ

సంగతి వెల్లడైపోతుంది.' అంది గాయత్రీదేవి.

'తెలిసిపోతేమాత్ర మేమిటి? మా గ్రీకులు మీరనుకున్నంత దుర్మార్గులు కారు. నేను మిమ్మల్ని ప్రేమించినట్లే వాళ్లూ మిమ్మల్ని గౌరవిస్తారు' అంది హెర్మియా.

'అలాగ చెప్పటానికి వీల్లేదు హిరణ్మయీ! చిన్నపిల్లవు నీకు రాజకీయాల సంగతి తెలియదు. మేము జాగ్రత్తగానే ఉండాలి. మా గుహ సంగతి నువ్వు ఎవరికీ చెప్పకూడదు. చెప్పేవంటే ఆ నోటా ఈ నోటా సెల్యూకసుకి తెలిసిపోతుంది. క్షమావతి తండ్రికి జబ్బుగా ఉంది కూడాను. సెల్యూకసు సైనికులు మా సంగతి తెలిసివస్తే ఇక్కడనుంచి ఈ జబ్బు మనిషితో తప్పించుకుపోవటం కూడా కష్టం.' అంది గాయత్రీదేవి.

హెర్మియా గాయత్రీదేవి చేతిలో చెయ్యి వేసి, 'అయితే మీ సంగతి నే నెవరికీ తెలియనివ్వను! ప్రాణం పోతుందన్నా సరే చెప్పను!' అని వాగ్దానం చేసింది.

ఆరోజు చీకటిపడటంతోనే హెర్మియా పుష్కలావతికి ప్రయాణమైంది. ఆమె వెడుతో తన చిట్టి చేతులతో గాయత్రీదేవికీ విశ్వజిత్తుకీ భారతీయుల పద్ధతిలో నమస్కారం చేసింది. క్షమావతిని కౌగలించుకుని, 'మనం తరుచూ కలుసుకుంటే ఎంత బాగుండును?' అంది. రోహిణితో, 'అవ్వా, వెళ్ళివస్తాను.' అంది.

రోహిణికి కూడా హెర్మియా వెడుతోందంటే బాధగానే ఉంది.

హారప్రియుడు అడవిలో ఏ క్రూరమృగమైనా ఎదురైతే అవసరమౌతుందని తన ఖడ్గాన్ని మొలకు తగిలించుకున్నాడు. కూడా ఒక కొమ్ముబూరాను తెచ్చాడు.

'ఈ బూరా ఎందుకు?' అంది హెర్మియా.

'నేను నీతో అడవిఅంచవరకే వస్తాను. అక్కడనుంచి నువ్వు పుష్కలావతి ప్రాకారంవరకూ ఒక్కర్తివే వెళ్లాలి. నువ్వు వచ్చినట్లు కోటలోవాళ్ళకి తెలపటానికి బూరా ఊత్తాను.' అన్నాడు హారప్రియుడు.

ఆరాత్రి వెన్నెల పుచ్చపువ్వులా కాసింది. అడవి గనుక ఎక్కడ చూచినా చెట్లూ, తుప్పలూ, డొంకలూ—వీటి నీడలే కనపడ్డా, చెట్లు లేనిచోట వెన్నెల నేలపైపడి, ఆ వెన్నెలలో నడిచిపోతూన్న వాళ్ళిద్దరికీ బలే సరదాగా ఉంది. ఏ కుందేలైనా బెదిరి పారిపోతూ చప్పుడుచేస్తే హెర్మియా ఉలిక్కిపడి హారప్రియుని భుజం పట్టుకుని ఆగిపోదియే. కాని వెంటనే ఏ కోకిల గానమో వినపడి, ఆ ధ్యానలో తాను బెదిరిన మాటే మరిచిపోయేది.

ఆరాత్రి ఆ అడవిలో ప్రయాణం చేస్తోంటే హెర్మియాకి హిపోలిటా చెప్పిన కథలు జ్ఞాపకానికొచ్చాయి. అడవిలో దెయ్యాలూ దేవతలూ ఉంటాయంది హిపోలిటా, దేవతలు రెక్కలుండి ఎగురుతూన్న పసిపిల్లల ఆకారాలలో ఉంటారుట. దెయ్యాలు మిడిగుడ్లతోనూ చింపిరిజుట్టుతోనూ చూడటానికి అసహ్యంగానూ, భయంకరంగానూ ఉంటాయిట. వెన్నెలలో వెడుతూన్నప్పుడల్లా హెర్మియాకు ఆ రెక్కల దేవతలు కనపడుతోన్నట్లే ఉండేది నీడలలో నడిచినప్పుడల్లా దెయ్యాలు ఎదురౌతాయేమో అనిపించేది. కాని తన పక్కనే హారప్రియుడు ఉన్నాడన్న ధీమాతో ఆమె దెయ్యాలు వచ్చినా భయపడనక్కర్లేదు అనుకుంది.

వాళ్ళు పుష్కలావతిని చేరుకునేసరికి తెల్లవారుతోంది. 'హిరణ్మయీ! ఇంక నేను దిగడతాను. నువ్వు ఆ దారమ్మటే వెళ్ళి కోటద్వారం చేరుకో. నేను ఈ చెట్టుచాటున ఉండి బూరా ఊత్తాను. మీ మనుష్యు లెవరైనావచ్చి నిన్ను తీసుకువెళ్లేవరకూ ఉండి, తర్వాత మా గుహకు పోతాను...మమ్మల్ని మరిచిపోవుకాదూ?' అన్నాడు హారప్రియుడు.

'ఎప్పటికీ మరిచిపోను. మీ అంత మంచివాళ్ళని నే నెలాగ మరువగలను?...మీరంటే మా ఎగయూసుకున్న అభిప్రాయం తప్పు అని కూడా చెప్పి అతని మతం మారుస్తాను.' అంటూ హెర్మియా మెల్లిగా పుష్కలావతివైపు నడిచింది. ఆమె కోటగుమ్మం చేరుకునేసరికి హారప్రియుని కొమ్ముబూరా ధ్వని వినపడింది. మరో క్షణానికి తలుపులు తెరుచుకుని కళ్లు నులుముకుంటూ గ్రీకుసైనికు డొకడు బయటకు వచ్చాడు.

వాడు రావటంతోనే ఆమె ఒకసారి అడవివైపు చూసి, 'నువ్వింక వెళ్ళవచ్చు'నన్నట్లు హారప్రియునికి తెలియజేసి, కోట ప్రవేశించింది.

(ఇంకా వుంది.)

(పెద్దకథ)

# హెర్మియా

10

హరప్రియుని కొమ్ముబూరాధ్వని విని, పుష్కలావతిలోనివాళ్ళంతా ఆనాడు పెందరాళే లేచేశారు. తప్పిపోయిందనుకున్న హెర్మియా ఎక్కడనుంచో వచ్చిందన్నవార్త వ్యాపించటంతోనే, పుష్కలావతంతా, సూర్యోదయంకావటంతోనే కలకలలాడుతో కనపడే తామరకొలనుకుమల్లే ఎక్కడ చూసినా వికసించినముఖాలతో కనపడింది.

హెర్మియా కంటపడటంతోనే హిపోలిటా ఆమెను మహదానందంతో ఎత్తుకు ముద్దాడింది. ఇంక మళ్లీ కళ్లబడదనుకున్న ఆ బాలికను చూడటంతోనే ఆ దాదికి కళ్ళమ్మట నీళ్లు ఆగేయికాదు.

ఎగెయూసు ఆనందానికి మేరలేకపోయింది. 'వచ్చావా నాతల్లీ!' అంటూ వచ్చి ఎదురుగా నిలబడి ఉన్న ఆ పిల్లని పదేపదే అడగటం మొదలెట్టేడు. పొంగిపొరలివచ్చే సంతోషంయొక్క ఉధృతం తగ్గేక, 'అమ్మా, ఐతే నువ్వు అడవిలో ఆరోజున చూస్తోండగానే మాయమైపోయావేమిటి? ఏంజరిగింది? ఇన్నాళ్లూ ఎక్కడున్నావు?' అని అడిగేడు.

'గుఱ్ఱంమీదనుంచి పడిపోయాను. కాలికి దెబ్బ తగిలింది...ఔనుగాని, ఇకముందు నువ్వు ఇంకా కొంచెం వేగంగా స్వారి చెయ్యాలోయ్!' అంది హెర్మియా.

'ఇకముందా? ఇకముందు నిన్ను విడిగా స్వారి చెయ్యనిస్తా ననుకుంటున్నావుకామోసు. ఎక్కడకు తీసుకువెళ్లినా ఇంక నిన్ను నా గుఱ్ఱంమీదే కూర్చోపెట్టుకు తీసుకువెడతాను తెలుసా? మంచిపనిచేశావులే! నిన్ను ఇప్పుడు మేము కనుక్కోలేకపోతే మీ నాయనకేమిటి చెప్పడం?' అన్నాడు.

"'మేము కనుక్కోలేకపోతే' అని అంటున్నావు; మహా నువ్వు నన్ను వెతికి తీసుకొచ్చినట్లు! నాఅంత నేనేగా వచ్చింది?" అంది హెర్మియా నవ్వుతో.

'అది సరేగాని ఇన్నాళ్ళనుంచి ఎక్కడున్నావు?'

'దేవతలుండేచోట!' అంది హెర్మియా.

'నీ వేళాకోళం కట్టిపెట్టి సరిగ్గాచెపుదూ తల్లీ నువ్వు క్షేమంగా ఉన్నావా?' అన్నాడు ఎగెయూసు.

'ఓ! నిక్షేపంలా. ఎదురుగానే నిలపడ్డాగా? చూడు. ఔనుగాని, ఎగెయూస్! ఇంక నువ్వెప్పుడూ ఇండియన్లని గాడిదలనీ, పందులనీ అంటే మాట దక్కదు! వాళ్ళంత మంచివాళ్లు ప్రపంచంలో ఎక్కడా ఉండరు తెలుసా?' అంది హెర్మియా.

'ఐతే నిన్ను కాపాడుత ఇండియన్లే నన్నమాట! నీ గుఱ్ఱం ఉత్తజీనుతో కనపడేసరికి నీకోసం అడవి అంతా వెతికేం. చుట్టుపక్కలఉన్న పల్లెలన్నీ వెతికేం. మనమంటే కిట్టనివాళ్లెవరో నిన్ను ఎత్తుకుపోయి దాచేసి ఉంటారని, ప్రతియిండియను ఇల్లూ సోదా చేయించాను తెలుసా? సరేకాని నిన్ను ఇంత ఆపేక్షతో చూసిన ఆ ఇండియన్లెవరో చెప్పేవుకాదు. వాళ్ళకి మంచి బహుమతీ ఇస్తాను' అన్నాడు ఎగెయూసు.

'నీ బహుమతీ వాళ్ళకక్కర్లేదు. వాళ్ళలో ఒక అవ్వ ఉంది. ఆమెని చూస్తే హిపోలిటా చెప్పిన కథలో మంత్రగత్తెలాగ ఉంటుంది. ఆ అవ్వకు గ్రీకులంటే అస

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

వ్యాం. 'బహుమతీ' అంటూ వెడితివా, నిన్ను రోకలి పుచ్చుకు తరుముకొస్తుంది!' అంది హెర్మియా.

'ఆ ఇండియన్లు ఎవరు?' అని ఎన్నిసార్లు ఎగయూసు అడిగినా హిరణ్మయి మాట తప్పించేసి వేళాకోళం మొదలెట్టిందే కాని విశ్వజిత్తు గుహ మాట చెప్పిందికాదు.

'పోనీలే అమ్మా బ్రతికి బాగుండి కంటపడ్డావు; అదే చాలు' పని చూసుకున్నాడు.

హెర్మియా గాయత్రీదేవికి చేసిన వాగ్దానం ప్రకారం, నాడేకాదు తర్వాతకూడా ఎవరు అడిగినా అడవిలోని ఆ కుటుంబం సంగతి చెప్పలేదు. ఆగుహలో కష్టపడుతోన్న ఆ రాజకుటుంబానికి సాయపడాలని ఆమె అనేకవిధాల ఆలోచించింది కాని, ఎలాగ తోడ్పడాలో ఆమెకు పాలుపోలేదు. వాళ్లమీద కలిగిన గౌరవంకొద్దీ ఆ బాలికకు ఏ భారతీయుడన్నా సానుభూతి ఏర్పడింది. విశ్వజిత్తు కుటుంబాని కామె తోడ్పడలేకపోయినా, పుష్కలావతిలో గ్రీకుల చేతికింద బానిసలుగా శ్రమపడుతోన్న భారతీయులను ఆమె ఎంతో కనికరంతో చూసేది.

## 11

అలెగ్జాండరు చక్రవర్తి సెల్యూకసును పాలకుణ్ణిగా చేసి తన సేనలతో ముందుకు సాగిపోయాడని చెప్పాము. ఆతనికి ఆర్యావర్తమంతా జయించాలని కోర్కెగా ఉండేది. ఆర్యావర్తమంటే మన దేశంలో హిమాచల పర్వతాలకీ వింధ్య పర్వతాలకీ మధ్యనుండే దేశమంతా నన్న మాట. పంజాబునుంచి తూర్పుగా చాలా దూరం వస్తే మగధరాజ్యంఉంది. ఆకాలంలో మగధరాజ్యాన్ని మహాపద్మనందుడనే గొప్పరాజు మహావైభవంతోనూ పరాక్రమంతోనూ పాలించేవాడు. 'కొడితే ఏనుగ కుంభస్థలాన్నే కొట్టాల'ని సింహం కోరినట్లు, అలెగ్జాండరు చక్రవర్తి, 'యుద్ధంలో ఓడిస్తే మగధరాజునే ఓడించాల'ని కోరేడు.

తనతోబాటు గ్రీకువీరులలో పేరుపొందినవాళ్ళ నందర్నీ వెంటబెట్టుకు వెళ్లేడు. పారశీకంలో లేచిన తిరుగుబాటు అణిగిపోయిందన్నవార్త రావటంతోనే అక్కడఉన్న రోహిలసుకు, 'మగధముట్టడిలో నాకు సాయపడాలి కనుక రావలసింద'ని ఉత్తరువు చేశాడు.

రోహిలసుకు యుద్ధమంటే సరదాయేగాని, ఎంత సరదా ఐనపనైనా కొంతకాలమయేసరికి ఎవరికైనా విసుగువేస్తుంది. ఆతనికి వయసు మళ్లింది. తల్లిలేనిపిల్ల హెర్మియాను చూసుకుంటూ మిగిలిన కాలమంతా శాంతంగా పుష్కలావతిలో గడిపెయ్యాలనిపించిం దతనికి. కాని చక్రవర్తిఆజ్ఞకు ఎదురు చెప్పటానికి వీల్లేదు గనక ఎకాయెకీనివెళ్లి అలెగ్జాండరును చేరుకున్నాడు. పుష్కలావతికి వెళ్లి హెర్మియాను ఒక్కసారి చూడటానికైనా వీలులేకపోయిందతనికి.

కాని తుదకు అలెగ్జాండరు చక్రవర్తికోర్కె ఫలించలేదు. రోహిలసుకుమల్లేనే తక్కిన గ్రీకుయోధులలో చాలామందికి యుద్ధమంటే విసుగువేసింది. జన్మస్థానమైన మాసిడోనియా దేశంలో వదిలి వచ్చిన తమ భార్యాపుత్రులపైకి ధ్యానం మళ్లి, బెంగతో వాళ్ళకి ఇంక ముందడుగు పడిందికాదు. ఆసంగతి కనిపెట్టిన చక్రవర్తి ఇంక తిరుగుముఖం పట్టక తప్పిందికాదు. ఆతడు మగధవరకూ వెళ్ళకుండా మధ్యలోనే సేనలతో తిరిగిపోవలసి వచ్చింది.

'ప్రభూ, దారిలో మాయింట ఒకటి రెండు రోజులు ఆగి మరీ వెళ్లాలి. తమకొరకు పుష్కలావతిలో ప్రత్యేకం ఒకభవనం తయారైంది!' అన్నాడు రోహిలసు.

'సరే' అన్నాడు చక్రవర్తి. రోహిలసు ముందుగానే ఎగయూసుకు వార్త పంపేడు. చక్రవర్తికి స్వాగతం ఇవ్వటానికని ఏర్పాట్లన్నీ చేయవలసిందని ఆజ్ఞాపించాడు.

తండ్రి వస్తున్నాడనేసరికి హెర్మియా చాలా సంబరపడింది. ఆమె తండ్రిని చూసి ఏడాదిపైగా ఐపోయింది.

ఆమె అలెగ్జాండరుచక్రవర్తిని అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. ఆయనకూడా వస్తున్నాడనటంతోనే తనదుస్తులలో మంచివాటిని ఆయన వచ్చినప్పుడు తొడుక్కోవడంకోసం వేరేతీసి ఉంచుకుంది.

చక్రవర్తికి స్వాగతం ఇవ్వటానికి పుష్కలావతిలో చాలా హడావుడిగా ఉంది. బూజులన్నీ దులిపేశారు. కిటికీలకు కొత్త తెరలు కట్టేరు. నేలపై పరవడానికి రత్నకంబళులు సిద్ధంచేశారు. చక్రవర్తికి విందు నిమిత్తం వెండిసామానంతా పైకితీసి మెరుగు పెట్టేరు.

తండ్రీ, చక్రవర్తీ వస్తున్నారేమో అని చూసిరావటంకోసం ఆమె కోట సింహద్వారం వరకూ చాలాసార్లు వెళ్లివచ్చింది. 'వస్తోంటే కొమ్ము బూరా ధ్వనులూ, జయ జయధ్వానాలూ వినిపిస్తా

యమ్మా, అప్పుడు మనం సింహద్వారంవద్దకు పోయి స్వాగతం ఇద్దాం.' అన్నాడు ఎగెయూసు.

చక్రవర్తికోసం ఎదురుచూడటంలో నాలుగు రోజులు గడిచిపోయాయి. ఐదోరోజు ఉదయమే బూరాలు వినిపించాయి. హెర్మియా బంతిలాగ ఎగిరి 'వస్తున్నారు, వస్తున్నార'నుకుంటూ పరుగెత్తింది.

ఆమె అటువంటి ఊరేగింపు ఎప్పుడూ చూడలేదు. మొదట గ్రీకుసైనికులు నడిచివచ్చారు. వాళ్ళ ఈటె మొనలూ, డాలులూ ధళధళా మెరిసిపోతున్నాయి. వెనుక గుర్రాలపైన సేనానులు వచ్చారు. హెర్మియాకు ప్రతీ సేనానీకూడా చక్రవర్తిలాగనే కనపడ్డాడు. 'ఎవరు చెప్మా చక్రవర్తి?' అని ఆమె యోచిస్తో నిలపడేసరికి ఒక పెద్ద గుర్రంమీద ఎత్తైన పురుషుడొకడు కనపడ్డాడు. ఆరుద్ర పురుగురంగులో ఉన్న ముఖమలువస్త్రాల్ని నేలకు తగిలేటంత పొడుగుగా ధరించి, ఎంతో ఠీవిగా ఉన్నాడాయన. ఆయన్ని చూడటంతోనే హెర్మియాకు, 'ఇతడే చక్రవర్తి.' అన్న సంగతి ఎగెయూసు చెప్పక్కర్లేకుండానే తెలిసిపోయింది.

ఆ విశాల వక్షస్థలం, కండలుతేరి పుష్టిగాఉన్న ఆ పొడుగాటి భుజాలూ, ఆ వెడల్పాటి నేత్రాలూ, ఆ అందమైన ముక్కూ, పట్టులాటి ఆ జుట్టూ చూచేసరికి, హెర్మియాకి చక్రవర్తిఅంటే భయం భక్తీ పుట్టుకొచ్చాయి. 'ఈయన ఇంత గొప్పవాడు గనకనే చక్రవర్తి అయాడు!' అనుకుందామె.

చక్రవర్తిని చూస్తో నిలపడిపోవడంలో ఆమె తన తండ్రిని గమనించనేలేదు. రోహిలసు గుర్రంమీద అలెగ్జాండరు వెనుకనే వచ్చాడు. చక్రవర్తి పుష్కలావతి కోట బురుజులను పరిశీలిస్తో, 'రోహిలస్, చాలా గొప్ప కోట ఇది!' అని మెచ్చుకున్నాడు.

రోహిలసు తన గుర్రంమీదనుంచి ఉరికి, చక్రవర్తిపాదమున్న రికాబును పట్టుకున్నాడు. చక్రవర్తి మెల్లిగా దిగి, రోహిలస్తోనూ తక్కిన యోధులతోనూ కోట ప్రవేశించాడు.

హెర్మియా అడ్డదారిని పరుగెత్తివచ్చి, తాను చక్రవర్తికోసం కట్టిఉంచిన పుష్పమాలను పట్టుకుని, ఆయనకోసం ఏర్పాటుచేయబడిన విడిదిగుమ్మంవద్ద సిద్ధంగా నిలబడింది. ఒక్కొక్క మెట్టే ఎక్కివస్తో చక్రవర్తి ఆమెను చూసి, 'రోహిలస్, మీ అమ్మాయి కదూ?' అన్నాడు.

'ఔను ప్రభూ' అన్నాడు రోహిలసు. చక్రవర్తి సమీపించటంతోనే హెర్మియా ఎగెయూసుతో, 'నన్ను ఎత్తుకో!' అంది. ఆమె అలాగ ఎందుకు ఆజ్ఞాపించిందో తెలియకుండానే ఎగెయూసు ఆమెను ఎత్తుకుని భుజాలపైన కూర్చోపెట్టుకున్నాడు. ఆమె అలెగ్జాండరుతో, 'ప్రభూ, ఆగండి!' అంది. చక్రవర్తి ఆగిపోయాడు. రోహిలసు, 'ఏంచేస్తుందో?' అని కంగారుపడ్డాడు. హెర్మియా తన చేతిలో ఉన్న పూలమాలను చక్రవర్తి తలకు చుట్టబెట్టింది. అలెగ్జాండరు సంతోషించాడు. చక్రవర్తి ముఖంమీది చిరునవ్వుచూసి రోహిలసు, కుమార్తె తన పరువు నిలబెట్టిందని పొంగిపోయాడు.

చక్రవర్తి హెర్మియా గులాబీబుగ్గపై మెల్లిగా తట్టి భవనం ప్రవేశించాడు. రోహిలసు ప్రేమపూర్వకంగా కుమార్తె తలను ఒక్కసారి నిమిరి ఎగెయూసువైపు తిరిగి 'ఎవడో ఇండియను ఒకణ్ణి ఖైదీగా తీసుకొచ్చాము. గదిలోపెట్టి తాళంవెయ్యి పారిపోకుండా చూడు. వాడు తప్పించుకుపోయాడంటే చక్రవర్తి నీబుర్ర తీయించేస్తాడు జాగ్రత్త!' అనిచెప్పి, తొందరగా లోపలికి వెళ్ళేడు.

'ఎవడు చెప్మా, ఈ ఇండియను?' అనుకుంటూ హెర్మియా ఎగెయూసును అనుసరించి వెళ్ళింది. ఇద్దరు గ్రీకుసైనికులమధ్య, చేతులు రెండూ చేర్చి బంధింపబడి వస్తూన్న ఆ ఖైదీని ఆమె చూచింది. చూడటంతోనే ఆమె ముఖం తెల్లబడిపోయింది. గుండె ఆగిపోయినట్లయి, ఆమె కొయ్యలా నిలబడిపోయింది. అందుకు కారణం, ఆ ఖైదీ మరెవరో కాదు; ఆమెను అడవిలో కాపాడి తుదకు పుష్కలావతికి క్షేమంగా చేర్చిన హారప్రియుడు!

## 12

ఆ స్థితిలో హారప్రియుణ్ణి చూడటంతోనే హెర్మియా ఆనందమంతా మటుమాయమైంది. ఎగెయూసు హారప్రియుణ్ణి తీసుకుపోయి ఒకగుర్రాలశాలలో పెట్టి, తలుపుతాళం వేసి చక్కావచ్చాడు.

'వీ డెవడో తెలుసా? చక్రవర్తిపై తిరుగుబాటు చేసిన విసుజిసు కొడుకేనట! చక్రవర్తి పరివారంతో

వస్తోండగా చూసి అడవిలో వీడు గబగబా ఒక చెట్టుక్కుతో దాకిపోయాట్ట. మన సైనికులు కనిపెట్టి, 'దిగు' అన్నారట. వీడు 'దిగను' అనేసరికి సైనికులలో ఒకడు చెట్టుఎక్కి కిందికి లాక్కొచ్చాడుట. మొదట ఎవడో ఇండియను అనుకుని వదలివెయ్యమన్నారు. కాని మన సైనికులలో ఒకడు వీణ్ణి విసుజిసు కొడుకని గుర్తుపట్టి చక్రవర్తితో వెళ్లి చెప్పేడు. చక్రవర్తి వీణ్ణి రప్పించి, 'మీ తండ్రి ఎక్కడ? మాపై తిరుగుబాటు చేశాడటగా?' అని గద్దించి అడిగేడు. ఎంతభయపెట్టినా ఈ మొండివాడు మాట్లాడలేదుట. 'చెట్టుకు కట్టేసి కొరడా పుచ్చుకు కొడితే వాడే చెబుతాడు!' అని సలహా ఇచ్చారుట కొందరు. కాని చక్రవర్తి, 'తీసుకుపోయి రెండురోజులు కస్తుపెడితే వాడే చెపుతాడు!' అని ఖైదీగా తీసుకొచ్చారుట.' అంటూ ఎగియూసు జరిగిన కథంతా హిపోలిటాకు చెపుతోంటే హెర్మియా వింది.

'ఎగియూస్, కస్తుపెట్టినా తన తండ్రి ఎక్కడున్నదీ ఈ ఖైదీ చెప్పడనుకో. అప్పుడేం జరుగుతుంది?' అని అడిగింది హెర్మియా.

'ఏం జరుగుతుందా? తీసుకుపోయి ఉరిదీస్తారు' అన్నాడు ఎగియూసు.

ఉరిదీస్తారనటంతోనే ఆమెకు ముచ్చెమటలూ పోశాయి. హారప్రియుణ్ణేనా ఉరితియ్యటం? ఆమెను ఎంతో ప్రేమతోచూచిన కుమావతి అన్ననేనా ఉరితియ్యటం? వాళ్ళఅమ్మ గాయత్రీదేవి ఆమెను కన్నతల్లికన్నా ఎక్కువగా చూసింది...విశ్వజిత్తు గుహలో ఆమె గడిపినరోజులు ఒక్కమారు ఆమెకు కళ్ళకు కట్టినట్లువి, 'హారప్రియుణ్ణి మా నాయనతో చెప్పి వదిలిపించాలి. వాళ్లెంత మంచివాళ్లో మా తండ్రితో చెపితే, ఆయన, చక్రవర్తితో చెప్పి హారప్రియుడికి ఏహానీ రాకుండా చేస్తాడు.' అనుకుంది. కాని తండ్రితో మాట్లాడడానికి ఆమెకు ధైర్యం చాలిందికాదు. తండ్రే విసా రోహిలనువద్ద ఆమె కంత చనువులేదు. ధైర్యం చేసిచెప్పాలన్నా ఆమెకు మరొక అభ్యంతరం కనపడింది. చెప్పడమంటూ వస్తే విశ్వజిత్తు గుహసంగతి చెప్పక తప్పదు. ఆసంగతి చెప్పనని ఆమె గాయత్రీదేవికి మాట ఇచ్చింది. తీరా వాళ్ళరహస్యం బట్టబయలు చేస్తే హారప్రియుడికి ఉపకారం జరగటంమాట అటుంచి, గుహాలోనివాళ్ళందరికీ ముప్పు వస్తుందేమో?

ఈ ఆలోచనలతో ఆమె ఆరోజంతా గడిపింది.

పుష్కలావతిలోని వాళ్ళంతా చక్రవర్తి వచ్చాడన్న సందడిలో ఉన్నారుగనుక నాడు ఆ బాలిక పడుతోన్న బాధ ఎవరికీ తెలిసిందేకాదు. రాత్రి విందుకు చేయవలసిన ఏర్పాట్లన్నీచేసి, కొంచెంసేపు విశ్రాంతి తీసుకుందామని ఎగియూసు ఒకచోట గోడకు చేరగిలపడ్డాడు. హెర్మియా వెళ్ళి వాని ఒడిలో కూర్చుని, 'ఎగియూస్, నీతో ఒక సంగతి చెప్పాలి. ఈ రహస్యం నువ్వెవరికీ తెలియనివ్వకూడదు.' అంది.

వాడు చిరునవ్వుతో, 'ఏమిటితల్లీ, ఈ పరమ రహస్యం?' అన్నాడు.

'నువ్వు గుఱ్ఱాలశాలలో పెట్టి తాళం వేసివచ్చిన ఆ అబ్బాయే నన్ను ఆనాడు అడవిలో రక్షిస్తు! నన్ను వాళ్ల నివాసానికి తీసుకువెళ్లి తల్లికి అప్పగించాడు. ఆమె రోజూ నాకాలికి కట్టుకట్టి కుదిర్చింది. అక్కడ ఉన్నన్నాళ్లూ వాళ్లంతా నన్ను ఎంతో ప్రేమతో చూశారు. అతనికేమీ అపాయంరాకుండా నువ్వు చూడాలి'.

ఎగియూసు ఆశ్చర్యపోయి 'నిజంగానా? ఇలాగ పట్టుపడిపోకుండా కాస్త జాగ్రత్తగా ఉంటే ఎంత బాగుండిపోను! కాని ఇప్పుడు అనుకుని ఏమిలాభం?' అన్నాడు.

'ఇప్పుడేం చెయ్యాలంటావు మరి?' అంది హెర్మియా.

"ఏంచెయ్యడానికేముంది? చక్రవర్తి వాణ్ణి తన సమక్షానికి రప్పించి,'మీ తండ్రి ఎక్కడదాగిఉన్నాడో చెప్పు' అని అడిగినప్పుడు ఏమీ దాచకుండా చెప్పేస్తే ఆయన కనికరించి వదిలెయ్యవచ్చు" అన్నాడు ఎగియూసు.

'హారప్రియుడు ప్రాణంపోయినా తమగుట్టు బైటపెట్టడు. తనవాళ్ళకు ఆపదరాకుండా చూచుకోడంకోసం తన ప్రాణాలను వదిలేస్తాడేగాని వాళ్లెక్కడున్నదీ చెప్పడు!' అంది హెర్మియా.

'చెప్పకపోతే అనుభవిస్తాడు!' అన్నాడు ఎగియూసు.

'అబ్బే. అలాగంటే ఎలాగ ఎగియూస్? హారప్రియుణ్ణి నువ్వే రహస్యంగా వదిలెయ్యాలి.'

'వదిలెయ్యడమే! నేనా? చక్రవర్తిఆజ్ఞనా ధిక్కరించమంటున్నావు?' అంటూ మెడమీద తల ఉందో లేదో తడిమి చూసుకున్నాడు ఎగియూసు.

'నీకంతభయమైతే మానాయనతో చెప్పు పోనీ.

ఆయన చక్రవర్తితో చెప్పి, వదిలిపించేస్తాడు.' అంది హెర్మియా.

'మీ నాయన ఎన్నడూ అంత తెలివితక్కువ పని చెయ్యడు. విసుజిసు తిరుగుబాటు చేశాడు. తిరుగుబాటుచేసినవాళ్ళంటే అలెగ్జాండరుకు కనికారం లేదు. చేజిక్కినకుర్రవాణ్ణి వదిలి విసుజిసును పట్టుకోడానికి దొరికిన ఈ ఒక్క అవకాశం అలెగ్జాండరు పోగొట్టుకుంటాడనా నీఉద్దేశం?' అన్నాడు ఎగెయూసు.

"రోహిలసుతో ఈ ప్రస్తావనతెస్తే హెర్మియా అడవిలో తప్పిపోయినదన్న సంగతి ఆయనకు తెలియటం, దానితో ఆయన నన్ను 'అంత అజాగ్రత్తగా ఉన్నావన్నమాట!' అని చివాట్లు పెట్టడం జరుగుతుంది. ఆయనతో ఈ గొడవచెప్పడం కొరివితో తల గోక్కోవడం లాంటిది." అని ఆలోచించి ఎగెయూసు హెర్మియాతో, 'ఈ ఇండియను ఎలాగపోతే నీకెందుకు తల్లీ? ఇండియన్లకీ పశువులకీ ఆట్టే తేడాలేదు...' అని ఇంకా ఏదో అనబోతుంటే, ఆమె కోపంతో వానివడిలోంచి చివాలున లేచి, 'ఎగెయూస్, వాళ్లు కాదు పశువులు! మనం! గ్రీకుల క్రౌర్యాన్ని తలుచుకున్నప్పుడల్లా ఈజాతిలో పుట్టినందుకు నాకు సిగ్గు వేస్తోంది!' అంది.

ఎగెయూసు నిర్ఘాంతపోయాడు. ఏమీ అనలేక ఆఖరికి, 'చిన్న పిల్లవు నువ్వు. ఈ రాచకీయాలలో కలగచేసుకోకూడదు. ఇంతకీ నావల్ల నయే దేమీ లేదు. నేను చక్రవర్తి ఆజ్ఞను ఎలాగ జవదాటగలను?' అన్నాడు.

ఆమె కోపంతోనే తన గదికి పోయి, మంచం మీద బోరగిలా పడుక్కుని వెక్కివెక్కి ఏడ్చింది. 'ఎంతో గొప్పవానికిమల్లే కనపడే ఈ చక్రవర్తి ఇంత రాతిగుండెవాడా?' అనిపించిందామెకు.

రాత్రి విందుకంతా సిద్ధమైంది. 'హెర్మియా ఏది?' అన్నాడు రోహిలసు. హిపోలిటా వెతుక్కుంటూ హెర్మియాగదికి వచ్చి, 'ఏమమ్మా, ఏడుస్తున్నావేమిటి? దేనికోసం? ఎర్రబారిపోయిన ఈ కళ్లు చూస్తే చక్రవర్తి ఏమనుకుంటాడు! అబ్బే. లే. ముఖం తుడుచుకో.' అంది.

హెర్మియా, 'చక్రవర్తి ఏమనుకుంటే నాకేం?' ఆయనముఖం చూడాలనే లేదు నాకు! ఆయన అంటే నా కసహ్యంవేస్తోంది!' అంది.

హిపోలిటా నిర్ఘాంతపోయి, 'ఏమిటి తల్లీ ఈ మాటలు! లే. మీ నాయనగారు తీసుకురమ్మన్నారు. నువ్వు రాకపోతే ఆయనకు కోపం వస్తుంది' అంటూ బుజ్జగించి తీసుకుపోయింది.

అలెగ్జాండరుచక్రవర్తి కులాసాగా కబుర్లు చెపుతున్నాడు. హెర్మియాను చూడటంతోనే అతడు ఆమె నిరుత్సాహంగా ఉండటం కనిపెట్టి, 'ఏమమ్మోయ్, ఎందుకూ ఏడ్చినట్లున్నావు? చందమామకోసమా?' అన్నాడు ఎగతాళిగా.

ఆమె సమాధానం చెప్పలేదు. రోహిలసుకి ఆమెమొహం చూసేసరికి చిరాకువేసింది. ఆమెను తీసుకుపోవలసిందని హిపోలిటాకు సంజ్ఞచేశాడు.

(ఇంకా ఉంది.)

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు
విక్టర్ హ్యూగో రచించిన
★ ఘంటారావం ★
పిల్లలకు పుస్తకరూపంలో తెలుగు అనువాదం
అనువాదకులు సూరంపూడి సీతారామ్
వెల రు: 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకము
ఆంధ్రగ్రంథమాల,
మదరాసు-1.






(పెద్దకథ)

# పారిణ్యము

## 13

హెర్మియా వెళ్లి పడుకుని ఆలోచించటం ప్రారంభించింది. ఆలోచిస్తోనే ఆమెకు నిద్ర పట్టేసింది. కాని అదంతా కలతనిద్ర. అర్థరాత్రి అయేసరికి ఆమెకు మెలకువ వచ్చింది. 'ఏ క్లైవరూ సాయపడరు. నువ్వే పూనుకోవాలి.' అని ఎవరో చెపుతూన్న ట్లనిపించిం దామెకు.

ఆమె వెంటనే లేచింది. తిన్నగా ఎగెయూసు పరుండేగదికి పోయింది. ఎగెయూసు ఉత్తిరోజుల్లోనే గాఢంగా నిద్రపోయేరకం. నాడు చక్రవర్తికి ఏర్పాట్లు చెయ్యడంలో చాలా అలసిపోయిఉన్నాడేమో, ఒళ్లు తెలియకుండా నిద్రపోతున్నాడు.

ఆమె పిల్లిలాగ చప్పుడుచెయ్యకుండా తాళం చెవులకోసం వెతికింది. ఆమెకు వాటిజాడ కనపడలేదు. తలగడ్రక్రింద పెట్టుకునిఉంటాడని తోచి ఆమె మెల్లిగా తన చిట్టి చేతిని తలగడ్రక్రిందకు పోనిచ్చేసరికి తాళాలగుత్తి చల్లగా ఆమెచేతికి తగిలింది. వానికి ఎక్కడ 'మెలకువవచ్చిపోతుందో' అన్న ఆదుర్దాతో ఆమె కొంచెకొంచెంగా తాళాలగుత్తిని పైకి లాగి, మెల్లిగా ఆ గదిలోంచి బయటకు జారింది.

ఒకటీ రెండూ కాదు, బోలెడుతాళాలున్నాయి ఆ గుత్తిలో. అవి చాలా బరువుగాఉండి ఆమె వాటిని రెండు చేతులా పట్టుకుంటేనేగాని మొయ్యలేకపోయింది. ఆమె వాటితో తిన్నగా హరప్రియుడు చెరపెట్టబడి ఉన్న గుఱ్ఱపుశాలవద్దకు వెళ్ళి తాళంకోసం తడిమింది.

తాళంచిల్లు పైగా ఉండి ఆమెకు అందిందికాదు. 'పొట్టివాళ్ళకు పుట్టెడుబుద్ధు'లన్నట్లు ఆమెకు వెంటనే ఒక ఉపాయం తట్టింది. పనివాళ్లు తవ్వినమట్టిని తీసుకుపోయేబండి ఒకటి ఆదగ్గిరే ఉండి కనపడింది. ఎలాగో శ్రమపడి దాన్ని తలుపువద్దకు లాక్కొచ్చి, ఆమె దానిమీద కెక్కి, తాళాన్ని అందుకోకలిగింది.

కాని ఆ తాళంచెవి ఏదో ఓ పట్టాన్ని ఆమెకు తెలిసిందికాదు. ఆ గుత్తిలో పొట్టివీ, పొడుగువీ, మధ్యరకానివీ చాలా చెవులున్నాయి. ఉజ్జాయింపుగా ఏ రకంవి పడతాయో చూసుకుని ఆ బాపతు ఒక్కొక్క చెవినే పెట్టి చూసింది. ఆఖరికి ఒక పెద్ద చెవి తాళంలో పట్టింది.

కాని అక్కడితో ఆమె శ్రమ తుద ముట్టలేదు. ఆ చెవి తాళంలో పట్టిందేకాని ఆమె దాన్ని తిప్పలేకపోయింది. ఒక చేత్తో తక్కిన చెవులన్నీ ఎత్తి పట్టుకుని రెండో చేత్తో గట్టిగా తిప్పాలి చెవిని. ఆ పని ఆ బాలికకు సాధ్యమైందికాదు.

'ఇంతవరకూ వచ్చి తాళంతియ్యలేకపోతున్నానేమిటి?' అని విచారించింది హెర్మియా. అప్పుడామెకు మళ్లీ ఒక ఆలోచన తట్టింది. ఇలాగే ఒకమాటు తాళం తియ్యలేక హిపోలిటా చెవిరింగులో అట్లకాడకొసను దూర్చి తిప్పింది! అప్పుడు తాళం సులువుగా వచ్చేసింది. ఆ సంగతి జ్ఞాపకంరావటంతోనే హెర్మియా వెంటనే వంటింటిదాకా పరుగెత్తివెళ్లి అట్లకాడను పట్టుకొచ్చింది. హిపోలిటా తిప్పినట్లే ఆ అట్లకాడను పెట్టి బలంకొద్దీ తాళంచెవిని తిప్పేసరికి కిఱ్ఱుమంటూ చప్పుడై తాళం తెరుచుకుంది.

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

ఆ చప్పుడు వినిపించి ఎవరైనా వస్తారేమో అని ఆమె భయపడింది కాని ఎవరూ రాలేదు. ఆమె మెల్లిగా తలుపు తెరచి లోపల ప్రవేశించి, 'హారప్రియా,' అని పిలిచింది.

కాని ఆమెకు బదులు రాలేదు. ఆ విశాలమైన శాలలో హారప్రియుడు ఎక్కడ పరున్నాడో ఆమెకు మొదట తెలిసిందికాదు. తలుపులు బారుపెట్టేసరికి వెన్నెల లోపల పడి హారప్రియుడు కాళ్లూ చేతులూ ముడుచుకుని దూరంగా ఒకగోడవార నిద్రపోతూన్న సంగతి ఆమె కనిపెట్టింది.

వాని బుజంమీద చెయ్యివేసి లేపబోయింది. హారప్రియుడు ఉలిక్కిపడి లేచి 'ఎవరు?' అన్నాడు. ఆమె, 'నేను; హిరణ్మయిని మెల్లిగా మాట్లాడు.' అంటూ వాని చేతికట్లను విప్పేసి, 'ఎలాగో తాళంతీసి తలుపులు తెరిచాను. త్వరగా ఇక్కడనుంచి పారిపోయి ప్రాణం దక్కించుకో!' అంది.

హారప్రియుడు నిద్రమత్తంతా పోయి ఒక్కగెంతు గెంతి నిలబడ్డాడు. 'నువ్వు ఒక్కర్తెవే వచ్చావా?' అన్నాడు.

'ఔను. ఎగెయూసును సాయపడమని కోరేను గాని లాభంలేకపోయింది. నేనే ఆఖరికి సాహసించాను. ఆలస్యం చెయ్యక త్వరగా మీ గుహ చేరుకో. గాయత్రీదేవి నువ్వెంతకూ రాలేదని బాధపడుతోంటుం దీపాటికి.' అంది హెర్మియా.

హారప్రియుడు ఆలోచిస్తో నిలబడిపోయాడు. 'హిరణ్మయీ! నాకు నువ్వు సాయపడ్డావని తెలుస్తే నీకూ మీ నాయనకూకూడా ముప్పువస్తుంది' అన్నాడు.

'ఏమీ రాదు. నేను సాయపడ్డానని ఎవరికి తెలుస్తుంది? దేవతలు వచ్చి నిన్ను విడిపించుకుపోయారనుకుంటారు. మీలాంటి మంచివాళ్లని దేవతలు రక్షించారంటే ఎవరైనా నమ్ముతారు.' అంది హెర్మియా.

హారప్రియునకు కృతజ్ఞతతో కళ్లు చెమ్మగిల్లేయి. తనకు సాయపడటానికి ఇంత సాహసంచేసిన హిరణ్మయికి ఏ ఆపదా రాకూడదని వాడు ఆర్యుల దేవతలనందర్నీ ప్రార్థించాడు. ప్రేమతో ఆమె చేతిని పట్టుకుని, 'హిరణ్మయీ!, మా అమ్మకు నువ్వంటే ఎంతో ఇష్టం. ఈ సంగతి తెలుస్తే ఆమె ప్రేమ కింక హద్దుండదు.' అన్నాడు.

వాడూ, ఆమే కొన్ని నిముషాలపాటు అలాగే ఉండిపోయారు. 'నువ్వు త్వరగా పోకపోతే ఈ శ్రమ వృథా ఐపోతుంది' అంది హెర్మియా.

'నిజమే.' అంటూ హారప్రియుడు ఆమెతోనహా శాలలోంచి బయటకొచ్చాడు. వెన్నెలలోంచి నీడలలోకి తప్పుకుని, 'వెడుతున్నాను.' అన్నాడు. వెళ్లనూ లేక ఆగనూలేక కొంతసేపు తచ్చాడి, ఆఖరికి గుండె నిబ్బరంచేసుకుని, చరచరా కోటను దాటి అడవిని ప్రవేశించి అదృశ్యమయాడు.

హెర్మియాకు గుండెపైనుండి పెద్దబరువేదో తీసేసినట్లైంది. ఆమె మెల్లిగా మట్టిబండిని లాక్కుపోయి యథాస్థానంలో పెట్టింది. తాళపుగుత్తిని తీసుకు వెళ్ళి, ఇంకా గుర్రుపెట్టి నిద్రపోతోన్న ఎగెయూసు తలగడక్రిందకు చేర్చింది. ఆ అట్లకాడమటుక్కి ఇంకా ఆమెచేతిలోనే ఉంది. చాలా అలసిపోయిఉండేమో. ఆమె ఆ ఇనపముక్క చేతిలోఉండగానే నిద్రపోయింది.

# 14

తెల్లవారింది. ఎగెయూసు ఖైదీని కొలక్రత్యాల నిమిత్తం బైటకు తీసుకొద్దామని తాళంచెవులగుత్తితో అశ్వశాలవద్దకు వెళ్లేడు.

శాలతలుపులు బారెట్టిఉండి, పంజరంలోని పిట్ట పారిపోయిందని తెలవడంతోనే ఎగెయూసుగుండె ఝల్లుమంది!

నౌకర్లలో ఒక్కొక్కణ్ణే పిలిచి, 'ఏమయాడు ఇండియను?' అని అడిగేడు. 'ఏమో' అన్నారు వాళ్ళంతా. వాళ్ళకేం తెలుసు, ఏం జరిగిందని?

ఎగెయూసుకు బుర్ర కరిగిపోతోన్నట్లుతోచింది. ఇండియను కుర్రవాడు పారిపోయాడని తెలవటంతోనే చక్రవర్తీ, రోహిలసూకూడా మండిపడతారు. తనకు రెక్కలొచ్చి అక్కడనుంచి ఎగిరిపోగలిగితే బాగుండుననిపించింది. ఆ అడవిలోకి పారిపోతేనో పోనీ? లాభం లేదు; గ్రీకుసైనికులు ఇట్టే వెంటాడి పట్టుకోగలరు. ఆ భగవంతుడే రక్షించాలి. 'దేవుడా, అలెగ్జాండరు చక్రవర్తి ఈ విందుల హడావుడిలో హారప్రియుని మాట మరిచిపోయేటట్లు చెయ్యి!' అని ఆ నిర్భాగ్యుడు ప్రార్థించటం మొదలెట్టేడు.

వాడు ఏడుపుమొహం పెట్టుకుని తనగదిని ప్రవేశిస్తోంటే హిపొలిటా ఎదురై, 'ఏమైపోయిందో అని తెగవెతికేను. ఆ పిల్ల చేతిలో పెట్టుకు నిద్రపోతోంది దీన్ని!' అంటూ అట్లకాడను చూపించింది.

బాధలోఉన్న మనుష్యులు తమకన్నా లోకువైనవాళ్ళమీద చిరాకుపడుతోంటారు. హిపోలిటా ఏమి చెప్పతోందో సరిగా వినిపించుకోకుండానే ఎగెయూసు 'నన్ను విసిగించక నీపని చూసుకోపోయి.' అన్నాడు. హిపోలిటా, 'అంత చిరాగ్గా ఉన్నావేంబాబూ పొద్దున్నే? అట్లకాడ దాచేసి నన్ను ఏడిపించాలని దీన్ని తీసుకుపోయి. హెర్మియాకు నువ్వే ఇచ్చావనుకున్నాను!' అంది.

పొమ్మంటేపోక ఇంకా నిలబడి మాటాడుతోన్నందుకు దాదిపైన అతనికి కోపంవచ్చింది. 'నీ అట్లకాడ నేను తియ్యడమేమిటి?' అని కసరబోయాడు. కాని ఆ అట్లకాడను చూడటంతోనే ఎగెయూసు ఆలోచనలోపడ్డాడు. 'హెర్మియా తాళం తియ్యటం కోసం ఈ అట్లకాడను ఉపయోగించలేదుకదా! హరప్రియుణ్ణి వదిలెయ్యమని నిన్న నాతో చెప్పింది... ఈపిల్ల చేసినపనే ఇది. ఎంతకైనా తగినది హెర్మియా! తాళంచెవిని తిప్పలేక అట్లకాడతో సాధించి ఉంటుంది. ఏనా కనుక్కుంటాను.' అంటూ వాడు తిన్నగా హెర్మియాగదికి వెళ్లేడు.

హెర్మియా, ధైన్యంతోవచ్చిన ఎగెయూసును చూడటంతోనే వాణ్ణి మ్మాట్లాడనివ్వకుండ తనే, 'ఔను ఎగెయూస్, హరప్రియుణ్ణి వదలిపెడత నేనే! నిన్నిసాయం చెయ్యమంటే చేశావుకాదు మరి. నన్ను రక్షించినవాళ్ళకు నేను ఆపదలో తోడ్పడకపోతే ఎలాగ? నువ్వు నన్నేమన్నా పడతాను!' అంది.

వాడు కోపం, దుఃఖం ముంచెత్తుకురాగా, 'నన్ను నాశనంచేశావు! నా తలపై వెండ్రుకలన్నీ ఒక్కమాటుగా తెల్లపడేటట్లు చేశావు!' అన్నాడు. ఇంకా ఏమనేవాడోగాని అంతలో వాళ్లకి అడుగులచప్పుడు వినపడింది. హెర్మియా హాలులోకి తొంగిచూసేసరికి చక్రవర్తి రోహిలసుతో మాట్లాడుతో ఎదురయాడు. ఆయన హెర్మియాను చూసి, ముద్దుగా బుగ్గపట్టుకుని, "ఏవమ్మా, నిన్నరాత్రి ఏడిచావుకాని ఇప్పుడు సరదాగానే ఉన్నట్లున్నావే? ఏమిటి కథ?" అన్నాడు.

హెర్మియా చక్రవర్తికి వంగి నమస్కరించి, 'ఇప్పుడు సరదాగానే ఉన్నానండి.' అంది.

'ఎందువల్ల? చందమామ నీకు చిక్కిందా?' అన్నాడు చక్రవర్తి నవ్వుతో.

'లేదుప్రభూ. అందరికీ వెన్నెలనిచ్చే చందమామ ఎత్తుగా ఆకాశంమీద ఉండడమే మంచిది' అంది.

'బలేపిల్ల!...రోహిలస్, మీ అమ్మాయి మంచి తెలివైనదోయ్!' అని మెచ్చుకుంటూ చక్రవర్తి ముందుకు సాగిపోయాడు. రోహిలసు సంతోషంతో చక్రవర్తి ననుసరించి వెడుతో, ఎగెయూసునుకూడా రమ్మని సంజ్ఞచేశాడు. ఎగెయూసు ముళ్ళమీద నడుస్తోన్నవాడికిమల్లే వెళ్లేడు. ఖైదీప్రసక్తి ఎక్కడ వస్తుందో అని ప్రాణాలు 'టువ్వు, టువ్వు' మంటూనే ఉన్నాయి వాడికి. వస్తే ఏమిటిచెప్పడం? 'భగవాన్, ఆ ప్రసక్తిరాకుండ చెయ్యవూ?'అని ప్రార్థిస్తోనే వెళ్లేడు.

మధ్యాహ్నం విందు అయాక విశ్రాంతి తీసుకుని చక్రవర్తి, 'ఇంక మేము వెడతాం రోహిలస్. పరివారాన్ని సిద్ధంగా ఉండమను' అన్నాడు.

రోహిలసు చెప్పకుండ ఎగెయూసు శరవేగంతో వెళ్ళి చక్రవర్తి గుఱ్ఱాన్ని సిద్ధపరిచాడు. చక్రవర్తి రికాబుపై కాలుపెడుతోంటే ఎగెయూసు, 'నేనెంత అదృష్టవంతుణ్ణి! చక్రవర్తి ఖైదీమాట మరిచిపోయాడు. మరోక్షణానికి వెళ్లిపోతాడు! ఆయన వెళ్లేక రోహిలసుతో జరిగినదంతా చెప్పి క్షమార్పణ కోరుకుంటాను. వాళ్ళ అమ్మాయి చేసినపనే గనుక ఆయన క్షమించకపోడు!" అనుకున్నాడు.

కాని ఎగెయూసు తాననుకున్నంత అదృష్టవంతుడు కాదు. ఏమంటే ఆ ఆఖరిక్షణంలో చక్రవర్తికి ఇండియనుబాలునిమాట జ్ఞప్తికొచ్చింది. గుఱ్ఱం ఎక్కబోయినవాడల్లా ఆగిపోయి, 'ఆ ఖైదీని నాముందు పెట్టేరు కాదేమి?' అన్నాడు.

దానితో ఎగెయూసుముఖం వెల్లవేసినట్లైపోయింది. వాడు వణుకుతో, 'ప్రభూ, క్షమించాలి. ఆ ఇండియనుబాలుడు తప్పించుకుపోయి, నా కొంప తీసేశాడు!' అంటూ చక్రవర్తిపాదాలపై పడ్డాడు.

## 15

హరప్రియుడు తప్పించుకుపోయాడనేసరికి అలెగ్జాండరుముఖం కోపంతో ఎర్రబారిపోయింది. అతడు రోహిలసువైపు తిరిగి, 'ఏమోయ్, ఇలాంటి చవటకా ఖైదీని వప్పచెప్పేవు?' అన్నాడు.

రోహిలసు చక్రవర్తికంటే ఎక్కువ ఆగ్రహంతో ఎగెయూసుపైన మండిపడ్డాడు. వాడు తప్పిం

చుకుపోయాడంటే నీబుర్ర పోతుందని చెప్పాకకూడా అశ్రద్ధచేశావన్నమాట! ఇంత దద్దమ్మవని నేననుకోలేదు! నా పరువు తీసేశావు!' అంటూ నానాచివాట్లూ పెట్టేడు.

ఎగెయూసు, 'ప్రభూ, నేను జాగ్రత్తగానే ఉన్నాను. తాళంచెవులు తలగడక్రింద పెట్టుకుపడుకున్నాను. నాకు తెలవకుండా తాళాలు తలగడక్రిందనుంచి వెళ్లిపోయాయి' అన్నాడు.

'ఎవరు తీశారు? ఆ ఖైదీకి తోడ్పడత ఎవరు? మీవాడా? లేక నా సైనికులలో ఎవడైనానా? చెప్పు! తొక్క చీరించేస్తాను!' అని గర్జించాడు చక్రవర్తి.

ఎగెయూసు మాట్లాడలేదు. 'తాళాలు తీస్త ఎవరో తెలుసా? మాట్లాడవేం?' అని ఉరిమేడు రోహిలసు.

'తెలుసు ప్రభూ.'

'ఎవరో చెప్పు!'

ఎగెయూసు మాట్లాడలేదు, 'మీ అమ్మాయే ఈ పని చేస్త!' అని చెప్పలేకపోయాడు. రోహిలసు తొందరచేసేసరికి వాడు, 'ప్రభూ, క్షమించాలి. నేను ఆ పేరు చెప్పలేను!' అనేశాడు.

దానితో చక్రవర్తికి వళ్లు మండిపోయింది. వీణ్ణి తీసుకుపోయి వెంటనే నేను చూస్తోండగా ఎదురుగా ఉన్న ఆ చెట్టుకొమ్మకు తాడుకట్టి ఉరితియ్యండి!' అని తన సైనికులకు ఆజ్ఞాపించాడు.

ఇంతవరకూ భయంతో వణికిపోతో మౌనంగా గుమ్మంవద్ద నిలబడి చూస్తోన్న హెర్మియా, ఎగెయూసును సైనికులు తీసుకువెడుతున్నారనటంతోనే బాణంలాగ వచ్చి, చక్రవర్తిముందు నిలబడి, 'ఆగండి! ఎగెయూసుది తప్పు లేదు. ఆ తాళాలు తీస్త నేను! హారప్రియుణ్ణి విడిపిస్త నేను!' అంది.

చక్రవర్తి, రోహిలసు, హిపోలిటా, వారేమి, వీరేమి, అక్కడున్నవాళ్లంతా లక్కబొమ్మలకు మల్లే రెప్పవెయ్యకుండా నిశ్చేష్టులై నిలబడిపోయారు. అలెగ్జాండరు తన కండ్లను తానే నమ్మలేకపోయాడు. మరుక్షణంలో హెర్మియా ఆయన పాదాలపై పడి, 'ప్రభూ, ఎగెయూసును వదలండి; ఆ శిక్ష నాకు విధించండి!' అంది.

చక్రవర్తి కోపమంతా పోయి, దిక్కులు మారుమ్రోగేటట్లు నవ్వటం ప్రారంభించాడు. 'నువ్వు చూడబోస్తే లొడితెడు లేవు! ఇంతపని ఎలాగ చెయ్యగలిగేవు? ఎందుకోసం చేసినట్లు?' అన్నాడు.

ఆమె తలఎత్తకుండానే అడవిలో తాను గాయపడి మూర్ఛపోయినప్పుడు హారప్రియుడు తనకు ఏ విధంగా తోడ్పడినదీ చెప్పింది. 'వాళ్ల నివాసస్థానమైన ఈ పుష్కలావతిని ఆక్రమించుకున్న గ్రీకుల పిల్లనని తెలిసికూడా హారప్రియుడూ, అతని చెల్లెలు క్షమావతీ, వాళ్ల తల్లి గాయత్రీదేవీ నన్ను తమ కుటుంబంలోదాన్నిగా చూసి, నా గాయం నయమయాక ఇక్కడకు సురక్షితంగా పంపేశారు. ప్రభూ, విసుజిసు తనకు జరిగిన అన్యాయాన్ని గూర్చి మనవిచేసుకుంటూ అర్జీలు పంపుకున్నాడట. సెల్యూకసు ఆ అర్జీలు ప్రభువులకు అందనివ్వలేదుట.' అని ఆ బాలిక నిర్భయంగా చెప్పేసింది.

'నేను జయించిన ఈ సామ్రాజ్యాన్ని సెల్యూకసు తన దౌర్జన్యంవల్ల పోగొట్టేటట్లున్నాడు చూస్తే!' అన్నాడు చక్రవర్తి. న్యాయం జరపటంలో శత్రువులనీ మిత్రులనీ తేడా చూపరాదన్న చక్రవర్తులలో అలెగ్జాండ రొకడు.

హెర్మియా హారప్రియుణ్ణి చెరలోంచి ఎట్లు విడిపించగలిగినదీ పూసగ్రుచ్చినట్లు చెప్పింది. అలెగ్జాండరు ఆశ్చర్యపోతో, 'అర్ధరాత్రివేళ నీకు భయం వెయ్యలేదా?' అన్నాడు.

'చంద్రుడున్నాడు కదండీ! వెన్నెలలో భయమేమిటి?' అంది హెర్మియా.

'అందరికీ వెన్నెల నిచ్చే చందమామ ఎత్తుగా ఆకాశంమీద ఉండడమే మంచిదన్నావు కదూ, ఇందాకా నాతో? ఇందుకేనన్నమాట! బలేపిల్లవు నువ్వు!' అని మెచ్చుకుంటూ చక్రవర్తి రోహిలసు వైపు తిరిగి, 'ఇంతటి ధైర్యమున్నపిల్లకు తండ్రి వైనందుకు నువ్వు గర్వించాలి!' అన్నాడు. విశ్వజిత్తు అర్జీమాట జ్ఞాపకంవచ్చి, 'ఐతే, ఈ ఇండియనురాజు ఎక్కడున్నాడిప్పుడు?' అని అడిగేడు.

“'వాళ్లెక్కడున్నదీ ఎవరికీ తెలియనివ్వను' అని నేను గాయత్రీదేవికి మాట ఇచ్చాను ప్రభూ.” అంది హెర్మియా.

'మాట ఇస్తే నిలుపవలసిందే మరి...రోహిలస్, ఈ విసుజిసు ఎక్కడున్నదీ తెలుసుకుని, మళ్లీ ఒక అర్జీ వ్రాయించి మాకు పంపు. జరుగవలసిన న్యాయాన్ని తప్పక జరిపిస్తాము. మేము మాసిడోనియా చేరు

# ఆదిమమానవుని ఆయుధరాజము

అదొక కొండగుహ. ద్వారంవద్ద మోహా కూర్చుని ఎదురుగా కనిపించే చక్కని ప్రకృతి దృశ్యం చూస్తున్నాడు. గుహకు కొంచెం దూరంలో అరణిశిలలూ, గండశిలలూ, బండరాళ్లూ ఉన్నాయి. వాటిమీద ఒకతొండ పరిగెత్తుతూ, గెంతుతూ ఆడుతోంది.

అది మధ్యాహ్నసమయం. ఎండ తీక్షణంగా ఉంది. ప్రాణులన్నీ ఏ చెట్టునీడనో, రాతినీడనో చేరి కూచుంటున్నాయి. అవి మానవజాతి ఆవిర్భవించిన కొత్తరోజులు. అప్పటి మనుషులు గుహల్లోనో, చెట్లమీదనో నివసించేవారు. భాష ఇప్పటిలాగ అభివృద్ధికాలేదు. వస్తువులపేర్లుమాత్రమే వాడుకలో ఉన్నాయి. ఆ పేర్లతోనే ఒకరి అభిప్రాయం ఒకరు తెలుసుకునేవారు. మోహా వాళ్ళ అమ్మదగ్గిరికి వెళ్లి "అన్నం" అనేవాడు. అంటే "భోజనం తయారుచేశావా? నాకు ఆకలిగా ఉంది," అని అర్థం. ఒక్కొక్కమాట నేతప్ప అనేకమైన మాటలతో సంభాషించుకోవడం అప్పటివారికి తెలియదు.

మోహాను ఇప్పుడు మీరుచూస్తే చాలా విచిత్రమైన జంతువు అనిపిస్తాడు. పన్నెండేళ్ళబాలుడైనా పదేనిమిదేళ్ళ బాలుడంత ఎత్తూ, లావూమాత్రమేఉన్నాడు. ముఖానా అరిచేతిలోనూ, అరికాలులోనూ, తప్ప మిగతా ఒళ్లంతా నూనూగు రోమాలు ఉన్నాయి. కళ్లు బాగా చిన్నవి; అవైనా లోతుగా, దగ్గిరదగ్గిరగా ఉన్నాయి. ముక్కు వెడల్పుగా, చప్పిడిగా ఉన్నది.

చిన్నవాడుగా కనిపించినా మోహా మంచిబలశాలి. ఇప్పటి మనుషులకంటె ఎక్కువ దూరం దూకగలడు ఎక్కువవేగంగా పరుగెత్తగలడు. ఎటువంటి చెట్టునైనా సులభంగా, త్వరగా ఎక్కగలడు. ఎటువంటి నేలమీదైనా వేగంగా పరుగెత్తగలడు. కాలివేళ్లతో పట్టుకుని తలకిందులుగా చెట్టుకొమ్మ నుండి ఎంతసేపైనా వేళ్ళాడుతూ ఉండగలడు.

మోహాపక్కన అతని చెల్లెలు సీనా కూర్చుని కునికిపాట్లు పడుతోంది. అప్పుడప్పుడు కళ్లుతెరిచి అన్నకేసిచూసి, ఒకసారి చుట్టూ కలయచూసి మళ్ళీ కునికిపాట్లు పడుతోంది. ఆమెకళ్లు పెద్దవి, చురుకైనవి, అందమైనవి.

చివరికామె లేచి, కళ్లు నులుముకొని, అన్నని బుజంమీద తట్టింది. "ఏమిటి మోహా! ఇందాకటినుంచి ఆలోచిస్తున్నావు?" అని అర్థంవచ్చేటట్లు ఒకముక్క ఏదో అన్నది.

మోహా జవాబివ్వలేదు. పక్కన ఒక కర్ర ఉన్నది. దానికి ఒక కొన చాలా వాడిగా వున్నది. అది తీసి, తన కేసి తేరి పారచూస్తున్న తొండమీదికి రయ్యిన విసిరేశాడు. సీనా కిలకిల నవ్వింది.

సూర్యుడు పడమటిదిక్కుకు తిరిగాడు ఇప్పటి కాలమానంప్రకారం సాయంత్రం నాలుగుగంటలవుతుంది. మోహా సీనాను వెంటబెట్టుకుని తను కర్రవిసిరిన చోటికి వెళ్లాడు. అతనికర్ర తొండకు తగలలేదుగాని, ఒక అరణిశిలకు తగిలింది. ఆ శిలలో ఒక చిన్న రంధ్రం ఉన్నది. అందులో కర్ర ఇరుక్కుని ఉంది. అందులో అది ఎలా గుచ్చుకున్నదా అని అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది.

ప్రపంచంలోకల్లా మొట్టమొదటి గొడ్డలి ఈవిధంగా తయారైంది. కాని అది గొడ్డలి అని, దాన్ని ఆయుధంగా ఉపయోగించవచ్చునని మోహాకు తెలియదు. అరణిశిలను తీసి పారవెయ్యడానికి మోహా చాలా ప్రయత్నించాడు. కాని కర్ర అందులోంచి ఊడి రాలేదు. ఇక కర్ర పనికిరాదని దాన్ని పైకెత్తి

## హిరణ్మయి

కున్నాక మా విజయాన్ని తెలపటానికని గొప్ప ఉత్సవాలలో పాల్గొనటానికి నువ్వు మీ అమ్మాయిని తీసుకుని రావాలి. మీ పిల్ల మా మెప్పు సంపాదించింది గనుక ఉత్సవంలో మహారాణితోబాటు రథంలోవచ్చే అధికారం ఈమెకు ప్రసాదించాము.' అని గుఱ్ఱమెక్కి పరివారంతో వెళ్లిపోయాడు. చచ్చిబ్రతికిన ఎగెయూసు హెర్మియాను యెత్తుకుని నాట్యం చెయ్యటం ప్రారంభించాడు.

(ఇంకా వుంది.)

# హిరణ్మయి

## 16

అలెగ్జాండరు వెళ్లేక తన తండ్రి తాను చేసిన పనికి కోపపడతా డనుకుంది హెర్మియా. కాని రోహిలసు అలాంటి తెలివితక్కువ పనేమీ చెయ్యలేదు. ఆమె తెగాయితేక్, ధైర్యసాహసాలకు అతడు నిజంగా గర్వపడ్డాడు. మాసిడోనియాలో జరుగబోయే ఉత్సవాలలో తన కుమార్తె రథంలో మహారాణీపక్కన కూర్చోబోతోందన్న తలపుతో అతడు పొంగిపోయాడు.

చక్రవర్తి వెళ్లిన మర్నాడు రోహిలసు కుమార్తెతో, 'ఈ విసుజిసు ఎక్కడ దాగిఉన్నాడో చెపితే, అతణ్ణి రప్పించి చక్రవర్తి అభయమిచ్చాడని చెపుతాను. అతడు మళ్లీ అర్జీ రాసి ఇస్తే చక్రవర్తికి పంపుతాము' అన్నాడు.

హెర్మియాకు గాయత్రీదేవి అనుమతి లేనిదే వాళ్ల గుహాసంగతి తండ్రికి కూడా చెప్పటం ఇష్టం లేదు. 'నేనే అడవిలోకి వెళ్ళి హారప్రియుణ్ణి తీసుకొస్తాను' అందామె.

'ఒక్కర్తెవూ వెళ్ళటానికి వీల్లేదు. మన సైనికుల్ని తోడిచ్చిపంపుతాను, వెళ్లు.' అన్నాడు రోహిలసు.

'మన సైనికులొస్తే, హారప్రియుడు నాకు కనపడడు. మన గ్రీకులంటే వాళ్ళకంత అపనమ్మకం'అంది హెర్మియా.

రోహిలసుకు ఏంచెయ్యాలో తోచక, కొన్నాళ్లు గడిచాయి. ఆఖరికి హెర్మియాకే ఒకఆలోచన తట్టింది.

పుష్కలావతిలో కలహంసుడనే ఒక పండితుడున్నాడు. ఆయనను రప్పించి, ఒక తాటి ఆకుమీద ఒకజాబు వ్రాయించింది. ఆకాలంలో ఇప్పటికిమల్లే రాసుకోడానికి కాగితాలు లేవు. తాటిఆకులమీద ఇనుపగంటాలతో వ్రాసేవారు.

'హారప్రియునికి—

అలెగ్జాండరు చక్రవర్తి మీకు అభయమిచ్చారు. పుష్కలావతికి నిర్భయంగా వచ్చి చక్రవర్తికి అర్జీ వ్రాయవలెను.'అని హెర్మియా కలహంసునిచే సంస్కృతంలో జాబు వ్రాయించింది. క్రింద 'హిరణ్మయి' అని సంస్కృతం అక్షరాలలోనే సంతకంపెట్టింది. ఆమెకు సంస్కృతం అక్షరాలు రావు. కాని చేవ్రాలుమాత్రం కలహంసునివద్ద నేర్చుకుని పెట్టింది.

ఆమె చేవ్రాలుకింద కలహంసుడు, 'ఈ ఉత్తరంలోని సంగతులన్నీ నిజం. ఇందులో మోసంఏమీ లేదు.' అని వ్రాసి తన సంతకంకూడా పెట్టేడు.

ఆ ఉత్తరాన్ని తీసుకెళ్లి అడవిదారిలో ఒక చెట్టుమానుకు ఒక బాణంతో గుచ్చారు. ఎప్పటికైనా ఆ జాబును హారప్రియుడు చూసుకుని పుష్కలావతికి వస్తాడని హెర్మియా ఆశించింది.

చాలా రోజులు గడిచాయి. కాని హారప్రియుని జాడ ఎక్కడా కనపడలేదు.

అతడు ఆ జాబు ఉన్న చెట్టుకేసే రాలేదన్న మాట. వాళ్లకి చక్రవర్తి అభయ మిచ్చాడన్న వార్త తనే స్వయంగా వెళ్లి చెప్పాలి. కాని తండ్రి వప్పుకుంటాడా తను ఒంటరిగా అడవిలోకి వెళ్లడానికి? పోనీ, చెప్పకుండా వెడితేనో? ఛా! అది తప్పవని!...ఈ విధంగా ఆలోచించుకుంటూ ఏమీ చెయ్యలేక చాలా రోజులు హారప్రియునికోసం ఎదురు చూసింది.

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

ఆఖరి కొకనాటిరాత్రి అడవిపంచలోనుండి కొమ్మూ బూరా ధ్వని వినిపించింది. హెర్మియా, 'హారప్రియుడు!' అంటూ లేచి రోహిలసు కూడా రాగా. కోటను దాటి ఆధ్వనివచ్చినవైపు వెళ్లింది. మళ్ళీ బూరా వినిపించింది. 'హారప్రియా, నాతో మానాయన తప్ప మరెవరూ లేరు. మా నాయన మీ కిప్పుడు మిత్రుడే. చక్రవర్తే మిమ్మల్ని కనికరించాడు. ఎక్కడున్నావో, నిస్సంకోచంగా వచ్చి కలుసుకో.' అని గట్టిగా అరిచింది.

ఆ సమీపంలోనే వాళ్ళరాక కనిపెడుతో ఒక చెట్టుపై నున్న హారప్రియుడు దిగివచ్చి వాళ్ళముందు నిలిచాడు. హెర్మియా అతణ్ణి చూడటంతోనే, 'హారప్రియా, తమావతి క్షేమంగా ఉందా? రాణి గాయత్రీ దేవికి నేను జ్ఞాపకం ఉన్నానా? మీ నాయన లేచి తిరుగుతున్నారా?' అని ఆగకుండా ప్రశ్నలు కురిపించింది. హారప్రియుడు ఆఖరిప్రశ్నకే బదులు చెప్పేడు. 'హిరణ్మయీ, మా నాయనగారు మరణించారు.'

'అయ్యో! ఎంతపని జరిగింది! ఎన్నాళ్ళైంది? చక్రవర్తి అభయమిచ్చారనీ, మీ కష్టాలు గట్టెక్కాయని ఆయనకు తెలియనేలేదా?' అంది హెర్మియా.

'లేదు. నేను ఇక్కడనుంచి తప్పించుకుపోయిన మర్నాడే మా తండ్రి ప్రాణాలు విడిచాడు...హిరణ్మయీ, నీ మేలు నే నెన్నటికీ మరువను. నీ వారాత్రి నాకు ఆ సాయం చేసి ఉండకపోతే ఆయన మరణ సమయానికి నేను దగ్గిర ఉండకుండా పోదును...

మానాయన పోయినప్పటినుంచీ మా అమ్మ దుఃఖంలో మునిగిపోయింది. నేను అప్పటినుంచీ బయటకు రాకుండా గుహలోనే ఉంటున్నాను. ఈనాడే వచ్చాను. చెట్టు మ్రానుకు గుచ్చిఉన్న ఉత్తరాన్ని చూసి, వెళ్లి మా అమ్మతో చెప్పేను. మొదట ఏదో మోసం అని సందేహించాము కాని నీ సంతకం, కలహాణపండితుని వ్రాలూ ఉన్నాయి గనుక అనుమానపడక్కర్లేదంది మా అమ్మ' అన్నాడు హారప్రియుడు.

రోహిలసు, 'ఇంక మీరు అడవిలో బాధపడక్కర్లేదు. వెంటనే నాతో కోటలోకి వచ్చి, నచ్చిన గుర్రాలను నాలుగింటిని తీసుకువెళ్ళి మీ వాళ్ళనందర్నీ ఇక్కడకు చేర్చు. పుష్కలావతిలో మీ భవనంలో మీ రుండురుగాని. కొత్తగా కట్టిన ఇంటికి నేనూ, మా హెర్మియా మారుతాము' అన్నాడు.

హారప్రియు డెందుకో మొదట సందేహించాడు. అతని సంకోచం గ్రహించి హెర్మియా, 'మీరు రాకపోతే మేమే మీ గుహకు వచ్చి ఉండవలసొస్తుంది. తమావతిని చూడాలని ఉంది నాకు. ఆమెకు వచ్చిన కథలన్నీ చెప్పిందేకాదు. ఎప్పుడు కలుసుకుంటానా, ఎప్పుడు వింటానా అనిపిస్తోంది నాకు...హారప్రియా, భర్త పోవటంవల్ల వచ్చిన కష్టాన్ని గాయత్రీదేవికి మనం తీసెయ్యలేం గాని, ఆ గుహలో ఏకాంతవాసంవల్ల కలిగే ఇబ్బందులను, నువ్వు వప్పుగుంటే, తప్పించవచ్చును.' అంది.

ఆమె మాటల నేర్పు చూసేసరికి రోహిలసుకు ఆశ్చర్యంవేసింది. 'మా చిట్టి హెర్మియాయేనా ఇది? మంచితనంలో తన తల్లిని మించి పోయింది! హెర్మియా అంతా ఆ తల్లిపోలికే.' అనుకున్నాడు. హారప్రియునితో, 'పుష్కలావతి మీదే కదా? మీ యింటికి మీరు రావటానికి సంకోచమెందుకు?' అని వప్పించి, అతణ్ణి వెంటబెట్టుకుని హెర్మియాతో కోటకు చేరుకున్నాడు.

తెల్లవారుఝామున హారప్రియుడు నాలుగు గుర్రాలను కొందరు సేవకులనూ వెంటబెట్టుకుని గుహకు పోయి, తమవారి నందరినీ పుష్కలావతికి తీసుకొచ్చాడు. వాళ్లు వచ్చేలోగానే రోహిలసు తమ సామానంతా కొత్తభవనంలోకి మార్పించేశాడు. కాని హెర్మియామాత్రం తమావతితోనో గాయత్రీదేవితోనో కబుర్లు చెబుతో పాతభవనంలోనే ఎప్పుడూ కనపడుతోండేది.

## 17

కలహాణపండితుడు అలెగ్జాండరుచక్రవర్తికి ఒక అర్జీని తయారుచేసి దానిపైన గాయత్రీదేవిచే చేవ్రాలు చేయించి రోహిలసుకు ఇచ్చాడు. రోహిలసు ఆ అర్జీని తన గుర్రపు రౌతులలో నమ్మకమైనవాడి కొకడి కిచ్చి, చక్రవర్తికి అందచెయ్యవలసిందని పంపేడు.

ఆ కాలంలో జాబులను తీసుకుపోవటానికి ఇప్పటికి మల్లే రైళ్లూ, విమానాలూ లేవు. మనుష్యులే నడిచో, గుర్రాలమీదనో వెళ్ళి అందచేసేవారు. రోహిలసు పంపిన ఆశ్వికుడు చక్రవర్తిని కలుసుకుని జాబునిచ్చి రావటానికి చాలారోజులుపట్టింది. చక్రవర్తి ఆ అర్జీని వెంటనే పరిశీలించి, గాయత్రీదేవికి ఒక జాగీరు నివ్వవలసిందనీ, అందులో ఆమె హోదాకు సరిపడ్డ దివ్యభవన మొకటికట్టించి ఇవ్వవలసిందనీ సెల్యూకసు పేర ఒక ఆజ్ఞాపత్రాన్ని పంపేడు.

ఆ ఆజ్ఞాపత్రాన్ని చూసుకున్న సెల్యూకసుకు చాలా కోపంవచ్చింది. తనకు తెలియకుండా విశ్వజిత్తు కుటుంబం చక్రవర్తిదయను సంపాదించారంటే ఆ సేనానికి చాలా గుబ్బుగా ఉండి, అతడు రోహిలసును రప్పించి, 'ఇదంతా ఎలాగ సాధ్యమైంది?' అని అడిగేడు. రోహిలసు జరిగినదంతా చెప్పి, 'విశ్వజిత్తు పంపుతున్న అర్జీలను తమకు అందచెయ్యలేదని చక్రవర్తికి ఆరోజున మీమీద కోపంవచ్చింది' అన్నాడు.

తన కిష్టంలేకపోయినా చక్రవర్తిఆజ్ఞను పాటించి తీరాలి గనుక సెల్యూకసు గాయత్రీదేవికి ఒక జాగీరును ఇచ్చాడు. కాని అది ఎందుకూ పనికిరాని బంజరుభూమి. దానిలో భవనం కట్టించడం మాటేమిటని రోహిలసు అడిగేడు 'బొక్కసంలో ఇప్పుడు సొమ్ము లేదు. సొమ్ముచేరటంతోనే కట్టిద్దాము.' అన్నాడు సెల్యూకసు. సొమ్ము లేక కాదు. అతనికి భవనం కట్టించటం ఇష్టంలేదు. దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వనన్నట్లైంది. గాయత్రీదేవికి చక్రవర్తి ఆమెకు ఉపకారం చేద్దామనుకున్నా సెల్యూకసు జరగనిచ్చేవాడు కాదు.

హార్మియా, 'ఇంకా భవనం కట్టించలేదేం?' అని రోహిలసుకు జ్ఞాపకంచేస్తూనే ఉండేది. మళ్ళీ ఒక అర్జీని పంపుతేగాని పనిజరిగేటట్లు లేదన్నాడు రోహిలసు. గాయత్రీదేవి, 'ఏమీ వద్దు ఊరుకోండి.' అంది కాని హార్మియా అలాగ ఊరుకోక కలహాణపండితుణ్ణి రప్పించి మరొక అర్జీని తయారుచేయించింది. గాయత్రీదేవి సంతకంకోసం తీసుకువెడుతోంటే, గుఱ్ఱపురౌతు ఒకడు కోటద్వారం ప్రవేశిస్తో ఆమె కంటపడ్డాడు. వాని ముఖం చాలా విచారంగా ఉంది.

'ఎవరు నువ్వు? ఎక్కడనుంచి రాక? ఎవరి కోసం?' అని మూడుప్రశ్నలు వేసింది హార్మియా.

'అలెగ్జాండరు అనుచరులలో ఒకణ్ణి నేను. బేబిలాను నగరంనుంచి వస్తున్నాను. రోహిలసు కావాలి.' అన్నాడు వాడు.

'చక్రవర్తి క్షేమమేనా?' అని అడిగింది హార్మియా.

'ఇంకెక్కడి చక్రవర్తి? మూడురోజులు చలి జ్వరంవచ్చి, చక్రవర్తి బేబిలానులో మరణించారు!' అన్నాడు వాడు.

హార్మియా చేతిలోని అర్జీ క్రిందపడిపోయింది.

అలెగ్జాండరుమరణానికి గ్రీకులతో బాటు, అతన్ని ఎరిగిన భారతీయులందరూ విచారించారు. రోహిలసు హార్మియాతో, 'మాసిడోనియాలో ఉత్సవాలు' జరుగుతాయనీ, అప్పుడు నీవు మహారాణీ రథంలో కూర్చుని ఊరేగుతావనీ మురిసిపోయాను! చక్రవర్తి స్వదేశం చేరకుండా దారిలోనే మరణించాడు!' అని నిట్టూర్చేడు.

హార్మియా 'నేను మహారాణి రథంలో ఊరేగ లేకపోయినందుకు విచారించటంలేదు. చక్రవర్తిపోయాడనటంతోనే సెల్యూకసు ఇంక గాయత్రీదేవికి ఏ ఉపకారంచెయ్యడు.' అంది.

ఆమెచెప్పినమాట నిజమే. చక్రవర్తి మరణవార్త విని, పైకి విచారం నటించినా లోపల సంతోషించాడు సెల్యూకసు. 'అలెగ్జాండరు సంపాదించి ఇచ్చి వెళ్ళిన రాజ్యమంతా నేనే ఇంక ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలవచ్చును!' అని మురిసిపోయాడా సేనాని. గాయత్రీదేవికి భవనం కట్టించిఇవ్వలేదు సరికదా తనకు ఇష్టంలేనిదే చక్రవర్తి అనుగ్రహాన్ని సంపాదించిన సామంతుల నందరినీ ఏదోవిధంగా హింసించటం ప్రారంభించాడు.

కొంతకాలానికి సెల్యూకసంటే భారతీయ సామంతులకే కాక, రోహిలసువంటి గ్రీకులందరికీ కూడా అసహ్యంవేసింది. దానితో సెల్యూకసుకు బలం తగ్గింది. కాని తన ఐశ్వర్యగర్వంలో ఆ మదాంధుడు రానున్న ఆపదను గ్రహించలేకపోతూండు.

## 18

ఆ రోజుల్లో ఆర్యావర్తంలో తూర్పున మగధరాజ్యం ఉన్నదనీ, దానిని మహాపద్మనందుడనే గొప్పరాజు పరిపాలిస్తోండేవాడనీ, అతణ్ణి జయించాలన్న కోర్కెతో అలెగ్జాండరు సేనలతో వెళ్ళేడుగాని గ్రీకు సైనికులు స్వదేశానికి మళ్ళిపోవాలని పట్టుబట్టడంవల్ల అతడు తిరిగిపోవలసివచ్చిందనీ చెప్పేము. ఆ మహాపద్మనందునకు మురి అనే భార్య ఉండేది. ఆమెకు చంద్రగుప్తుడనే కుమారుడుండేవాడు. మురి కులం తక్కువదన్న కారణంవల్ల ఆమెనూ చంద్రగుప్తుణ్ణీ తక్కిన నందకుమారులు హీనంగా చూసేవారు. 'ఎవరు హీనులో, ఎవరు ఘనులో తెలియజేస్తాను.' అని

చంద్రగుప్తుడు తన సవతిసోదరులనందరినీ నాశనం చెయ్యటానికి కంకణం కట్టేడు.

చంద్రగుప్తుడొకరోజు ఉదయం షికారువెళ్ళి వస్తోంటే ఊరిబయట అతనికొక బ్రాహ్మణుడు కనబడ్డాడు. ఆ బ్రాహ్మణుడు తను తాటాకులమీద వ్రాసుకునే గంటంతో, దారిలోఉన్న ఒక ముళ్ళదుబ్బును దీక్షగా తవ్వుతున్నాడు. చంద్రగుప్తుడు చూసి, 'ఈ ముళ్ళకంచెను తవ్వుతున్నారు, ఏంచేస్తారు దీనితో?' అని అడిగేడు.

'నాదారిని నేపోతోంటే ఇది నాకు గుచ్చు




కుంది. దీన్ని వేళ్ళతో పెరికి నాశనంచేస్తాను!' అన్నాడా బ్రాహ్మణుడు కోపంగా.

'చెట్టుమీదే ఇంత పగబట్టిన ఈ బ్రహ్మచారి శత్రువుమీద ఎంతైనా పగపట్టగలడు!' అని తోచి చంద్రగుప్తుడు, 'అయ్యా, తమ పేరేమి? ఈరోజున తమరు మాయింట దేవతార్చనకు దయచెయ్యాలి.' అన్నాడు.

'నాపేరు చాణక్యుడు. నువ్వెవరు?' అన్నాడు బ్రాహ్మణుడు.

'నేను మహాపద్మనందుని భోజనశాలాధికారిని. నాపేరు చంద్రగుప్తుడు. మీకీరోజున విందుచేయిస్తాను, దయచెయ్యండి.' అన్నాడు చంద్రగుప్తుడు.

చంద్రగుప్తుడు చాణక్యుణ్ణి తీసుకుపోయి భోజనశాలలో మొదటిపీటపైన కూర్చోబెట్టేడు. చాణక్యుడు సంధ్యవారుస్తోంటే నందకుమారులలో ఒకడు వచ్చి, 'ఇది రాజూ, రాజపుత్రులూ కూర్చునే పంక్తి! ఇక్కడ కూర్చున్నావేమిటి? నీవంటి సత్రపుభోజనంగాళ్ళకి వేరేశాల ఉంది. అక్కడకు పో.' అన్నాడు.

చాణక్యునికి కోపం వచ్చింది. 'నేను కూర్చున్న చోటునుంచి బ్రహ్మరుద్రులొచ్చినా లేవను!' అన్నాడు. రాజపుత్రుడు, 'లేవవా?' అంటూ చాణక్యుని పిలక పట్టుకు లేవదీసి, భోజనశాలలోంచి అవతలకు గెంటేశాడు.

చాణక్యుడు కళ్ళనుండి నిప్పులు రాలుస్తో, 'నందకుమారుణ్ణన్న మదంతో నన్నవమానంచేశావు! నందవంశమంతా నాశనంచేసేవరకూ నా పిలకను ముడివెయ్యను!' అంటూ ప్రతిజ్ఞచేసి చరచరా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

చంద్రగుప్తుడు చాణక్యుణ్ణే అనుసరించివెళ్ళి, 'అయ్యా, ఈ నందులు నన్నూ అవమానించారు!' అన్నాడు.

'అనుభవిస్తారు! వీళ్ళందర్నీ నాశనంచేసి, మగధ సింహాసనంమీద నిన్ను కూర్చోపెడతాను.' అన్నాడు చాణక్యుడు.

'మహాప్రసాదం!, అని చంద్రగుప్తు డాయనకు నమస్కరించి, ఆయన చెప్పినట్టల్లా చెయ్యటం మొదలెట్టేడు.

చాణక్యుడు మహామేధావంతుడు. ఆత డన్నంత పని చెయ్యగలిగేడు. నందరాజులకు విరోధులైన రాజులందర్నీ కూడగట్టి చంద్రగుప్తునకు సాయం రప్పించి, నందరాజును మగధనుండి పారదోలేడు.

చంద్రగుప్తుడు చాలా పరాక్రమవంతుడు. చాణక్యుని బుద్ధిబలం తోడై ఆతడు గొప్పసామ్రాజ్యాన్ని స్థాపించగలిగి, దాసీపుత్రుడనేమాటపోయి ఘనుడనిపించుకున్నాడు.

పంజాబులో సెల్యూకసు పరిపాలనంటే విసుగెత్తిపోయిన భారతీయసామంతులంతా చంద్రగుప్తుని పరాక్రమం విని, 'పంజాబుపై దండెత్తివచ్చి, మాకు ఈ విదేశీయునిపీడ వదిలించవలసింద'ని కోరుతూ రాయబారాలు పంపేరు. చంద్రగుప్తుడు గొప్పసేనతో పంజాబు ప్రవేశించాడు.

గ్రీకులకూ ఇండియన్లకూ జరిగిన ఆ యుద్ధంలో ఇండియను సామంతులందరూ చంద్రగుప్తునిపక్షాన చేరేరు. విశ్వజిత్తుకుమారుడు హారప్రియుడు చంద్రగుప్తునిముందు నిలిచి, 'ప్రభూ, సెల్యూకసు మమ్మల్ని అనవసరంగా బాధించి, మా తండ్రిని అడవిలో దిక్కుమాలిన చావుకు గురిచేశాడు! ఈ దుర్మార్గుణ్ణి బంధించితెచ్చి, తమముందు పడేసే హక్కు నాకు ప్రసాదించండి.' అని కోరేడు. చంద్రగుప్తుడు 'సరే' అన్నాడు. హారప్రియుని కొక గొప్పసేనను తోడిచ్చి పంపేడు.

ఆ యుద్ధంలో రోహిలసునంటి గ్రీకుయోధు లెవరూ సెల్యూకసుకు తోడ్పడలేదు. సెల్యూకసు యుద్ధంలో ఓడిపోయి, హారప్రియునికి చిక్కేడు. చంద్రగుప్తుడు చాణక్యునివైపు తిరిగి, 'అయ్యా, ఈ గ్రీకురాజు నేమిచెయ్యమన్నారు?' అని అడిగేడు. చాణక్యుని సలహాచెయ్యనిదే చంద్రగుప్తుడు ఏపనీ చేసేవాడుకాదు.

చాణక్యుడు నవ్వుతో, 'అలెగ్జాండరు పురుషోత్తముణ్ణి రాజును గౌరవించవలసినట్లు గౌరవించి వదిలేశాడు. అట్లే నువ్వుకూడా ఇతణ్ణి గౌరవించి వదిలెయ్యి. ఇతనికి హెలెను అనే ఒక చక్కని కుమార్తె ఉన్నదని విన్నాను. ఆమెను నువ్వు వివాహంచేసుకుని, ఈతనికి అల్లుడవై, భారతీయులకీ గ్రీకులకీ శాశ్వతమైన మైత్రి కలిగేటట్లు చెయ్యి.' అన్నాడు. సెల్యూకసుతో 'పంజాబులోని భారతీయ

# ముగ్గురు బీదవాళ్లు

పూర్వం ఒకదేశంలో ముగ్గురు అన్నదమ్ము లుండేవారు. పాపం ముగ్గురూ పరమదరిద్రులు. వారికి ఉన్న ఆస్తి అంతా వారు కట్టుకునే చింకిబట్టలు, ఒకగుడిసె, గుడిసెవెనుక ఒక మామిడిచెట్టు. మామిడిచెట్టుకు కాసే పళ్లే వారికి జీవనాధారం. అందుచేత వారు వంతులువేసుకుని ప్రతి రాత్రీ మామిడిచెట్టును కంటిని రెప్పలాగా కాపాడుకునేవారు.

ఒక వెన్నెలరాత్రి పెద్దవాడు చెట్టు కాపలా కాస్తుండగా ఒక బిచ్చగాడు ఎంతోదూరంనుంచి వస్తున్నట్టు వగరుస్తూ వచ్చాడు.

"అయ్యా, నేను బిచ్చగాణ్ణి. మూడురోజులనుంచీ ఎంగిలి మెతుకైనా దొరకలేదు. కాస్త ఏమన్నా పెట్టి ప్రాణం రక్షించండి," అని వేడుకున్నాడు వాడు.

పెద్దన్నకి వాణ్ణి చూసి కడుపు తరుక్కుపోయింది. "తీసుకో అబ్బాయ్! నీకు కావలసినన్ని పళ్లు తీసుకో. అయితే ఆ రెండుకొమ్మలూ ముట్టుకోకు. అవి మా తమ్ముళ్ళవి. వాటిమీద నాకు అధికారంలేదు. ఈకొమ్మ నాది. దీనిమీద కాసిన పళ్లలో నీకు కావలసినన్ని తీసుకో," అన్నాడు.

బిచ్చగాడు కొమ్మ అంతా దులుపుకుని, కొన్నితిని, మిగతావి మూటగట్టుకుని తీసుకుపోయాడు.

తరవాత వరసగా రెండు రాత్రులూ ఆ బిచ్చగాడు వచ్చి, మిగిలిన ఇద్దర్నీ అడిగి, వారి వారి కొమ్మల్నికూడా దులుపుకుని చక్కాపోయాడు.

అలా బిచ్చగానిరూపంలోవచ్చిన వాడు మానవుడు కాడు, దేవేంద్రుడు. ముగ్గురు అన్నదమ్ముల కష్టాలు చూసి జాలిపడి వారి కెలాగైనా సాయంచేయాలనుకున్నాడు. అయితే వారు సహాయానికి అర్హులో కారో పరీక్షించనిదే సాయం చేయరాదనుకుని ఈవిధంగా పరీక్షించాడు. ముగ్గురూ మంచివాళ్ళనీ, పరోపకారస్వభావులనీ తేలిపోయింది.

నాలుగోరోజు ఉదయమే ఆ బిచ్చగాడు వారివద్దకు తిరిగి వచ్చాడు:

"అయ్యలారా! మీరు నాకు కష్టదశలో ఎంతో సహాయం చేశారు. మీ ఋణం, తీర్చుకోవాలనుకుంటున్నాను. నాతో అలా కొంతదూరం వస్తారా?" అని అడిగాడు.

'వీడు మనకేం సహాయం చేస్తాడూ?' అని ఆశ్చర్యపడుతూ అన్నదమ్ములు వాణ్ణి అనున

---

సామంతు'లంతా ఇంక చంద్రగుప్తునికి కప్పం కడతారు. నీ అల్లునికి కట్నంక్రింద, నీ ఏలుబడిలోఉన్న ఆఫ్ఘనుస్థానాన్ని ఇచ్చెయ్యి' అన్నాడు. సెల్యూకసు గత్యంతరంలేక, ఆ సంధికి ఒప్పుకుని చంద్రగుప్తునికి తన కుమార్తెనిచ్చి పెళ్ళిచేసి, ఆఫ్ఘనుస్థానాన్ని అల్లుని వశం చేశాడు.

హెలెన్ చంద్రగుప్తుల వివాహంతోబాటు మరొక్కపెండ్లికూడా ఐంది. ఆ వధూవరులు హిరణ్మయి హర్షప్రియులని మీకీపాటికి తెలిసే ఉంటుంది. హిరణ్మయిధైర్యసాహసాలకు మెచ్చుకుని అలెగ్జాండరుచక్రవర్తి మాసిడోనియాలో జరగబోయే ఉత్సవాలలో మహారాణిరథంలో కూర్చుని ఊరేగే హక్కు ప్రసాదించాడు. అతడు అకస్మాత్తుగా స్వదేశం చేరుకోకుండానే మరణించడంవల్ల ఆ గౌరవం హిరణ్మయికి దక్కలేదు. కాని మరొక చక్రవర్తి పెండ్లి ఊరేగింపులో, తనుకూడా తన పెండ్లికొడుకైన హర్షప్రియునితో ఊరేగే భాగ్యం ఆమెకు లభించింది.

హర్షప్రియుడు చంద్రగుప్త సార్వభౌముని ఆదర గౌరవాలకు పాత్రుడై, పంజాబులోని సామంతరాజులకు మొనగాడయాడు. హిరణ్మయి 'గొప్పరాణి' అనిపించుకుంది. ఆమెకు కొడుకులూ కూతుళ్లూ చాలామంది పుట్టేరు. తన చిన్నతనంలో జరిగిన చిత్రకథంతా వాళ్ళ కామె చెపుతోండేది వాళ్లామెకథను మళ్ళీ మళ్ళీ చెప్పించుకుని సరదాగా వింటూండేవారు.

(అయిపోయింది)